

పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801
S.R - 9551168092

ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

స్త్రీల ఆలోచనల్లో మార్పుతోనే సమాజ అభివృద్ధి

- సినీ నేపథ్యగాయని ఎస్పీ శైలజ
- ఘనంగా 'తెలుగు తరుణి' దశమ వార్షికోత్సవం



విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్త్రీల ఆలోచనల్లో మార్పు వస్తే సమాజం బాగుంటుందని ప్రముఖ సినీ నేపథ్యగాయని ఎస్పీ శైలజ పేర్కొన్నారు. టి.నగర్ సర్‌పిట్టి త్యాగరాయ హాలులో శనివారం జరిగిన తెలుగు తరుణి దశమ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన నేపథ్యగాయని ఎస్పీ శైలజ సేవలను కొనియాడుతూ 'శ్రీకాంత' పురస్కారంతో సత్కరించారు. అవార్డుపై స్పందించిన ఎస్పీ శైలజ మాట్లాడుతూ, స్త్రీల ద్వారా మాత్రమే నడుస్తున్న తెలుగు తరుణి భవిష్యత్తు ప్రకాశవంతంగా ఉంటుందన్నారు. తెలుగు తరుణికి సారథ్యం వహిస్తున్న రమణి, ఆమె బృందం కృషి శ్లాఘనీయమని, ఈ సంస్థకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు.

'తరుణీయం, రమణీయం, కమనీయం' అనే నినాదంతో తెలుగు కార్యక్రమాలకు అద్దం పడుతున్న తెలుగు తరుణి అధ్యక్షురాలు కాసల రమణి పర్యవేక్షణలో ప్రారంభమైన దశమ వార్షికోత్సవంలో సంగీతం, నృత్యం, వినోదం, హాస్య వల్లరి, ప్రముఖుల ప్రసంగాలు, సత్కారం, పురస్కార ప్రదానం, బృందగానం విద్యార్థులకు ఉపకార వేతనాల అందించే కార్యక్రమాలు జరిగాయి. నగరంలో వృత్తిరీత్యా స్థిరపడిన తెలుగు కుటుంబాల్లోని మహిళల కోసం 2015లో మాజేటి జయశ్రీ స్థాపించిన తెలుగు తరుణి ఆధ్వర్యంలో విద్య, వైద్యం, సామాజిక, కళలు తదితర కార్యక్రమాలను తెలుగులోనే నిర్వహిస్తూ అమ్మభాష పరిరక్షణకు కృషి చేస్తోంది. అలాగే ఈ కార్యక్రమానికి గౌరవ అతిథులుగా హాజరైన డాక్టర్ జి.లలిత, లింగంనేని సుజాత, డాక్టర్ ఉషా అయ్యగారిలను కూడా సంస్థ తరఫున జ్ఞాపికలతో సత్కరించారు. ముందుగా మాజేటి జయశ్రీ చిత్రపటానికి నివాళులర్పించి, మౌనం పాటించారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని టీనగర్ కేసరి, మైలాపూర్ కేసరి, ఎస్‌కేపీడీ, కేటీసీటీ, విల్లివాక్కం కనకదుర్గా తెలుగు పాఠశాలల్లో టెన్త్, ప్లస్‌టూలో గణితంలో అధిక మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు ఉపకారవేతనం అందజేసి అభినందించారు. సంస్థ తరుఫున ఇప్పటివరకు 60 సంగీత కార్యక్రమాలను శ్రీకాళహస్తి, తిరుపతి, తిరువణ్ణామలై తదితర పుణ్యక్షేత్రాల్లో నిర్వహించామని, ప్రతిఏటా ఉపాధ్యాయులు, మాతృభాష, బాలల దినోత్సవాల సందర్భంగా తెలుగు పాఠశాలల్లో పోటీలు నిర్వహించి విద్యార్థులకు తనవంతు సహకారం అందిస్తున్నట్లు రమణి తన అధ్యక్షోపన్యాసంలో తెలిపారు. కార్యదర్శి పి.దేవసేన, జాయింట్ కార్యదర్శి కె.శైలజ, ట్రెజరర్ ఎం.అపర్ణ, తెలుగు తరుణి సభ్యులు కార్యక్రమ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

విజయం సరే... మెజారిటీ ఎంత?

- నియోజకవర్గ ఇన్‌ఛార్జులతో స్టాలిన్ భేటీ



అరివాలయంలో మనప్పారై నియోజకవర్గం ఇన్‌ఛార్జితో చర్చిస్తున్న డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్

చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలపై ప్రభావం చూపుతున్నాయని, ప్రస్తుతం 200 సీట్లకు మించి గెలవాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. తేనాంపేటలోని అన్నా అరివాలయంలో జూన్ 13 నుంచి 'ఉడన్ పిరప్పే వా' పేరుతో రోజుకు మూడు నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ఆ నియోజకవర్గాల పరిధిలోని పార్టీ జిల్లా శాఖల నేతలతో ఆయన భేటీ అవుతున్నారు. ఆ సమయంలో ప్రతి నియోజకవర్గంలో పార్టీ స్థితిగతులను తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం అరివాలయంలో మనప్పారై, పాపనాశం, పట్టుకోట అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పార్టీ జిల్లా కార్యదర్శులతో వేర్వేరుగా స్టాలిన్ సమావేశమయ్యారు. నియోజకవర్గం నేతలతో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే సానుకూల పవనాలే బలంగా వీస్తున్నాయని డీఎంకే, దాని మిత్రపక్షాల అభ్యర్థుల విజయం ఖాయమే అయినప్పటికీ వారంతా ఎంత మెజారిటీతో గెలుస్తారనే అంశమే తనకు ముఖ్యమని, తక్కువ మెజారిటీ వస్తుందనే చోట పార్టీని బలపరుస్తామని ఆయన వివరించారు. ప్రతిపోలింగ్ కేంద్ర పరిధిలో 30 శాతం మందిని పార్టీలో చేర్పించే కార్యక్రమాలను, ఏకతాటిపై తమిళనాడు నినాదంతో ప్రతి ఇంటా ప్రభుత్వ పథకాలతో ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసే కార్యక్రమాలపై కూడా దృష్టిసారించాలని హితవు పలికారు. స్టాలిన్‌తో పాటు డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, ప్రచార ప్రతినిధి టీకేఎస్ ఇలంగోవన్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ ప్రజల వద్దకు స్టాలిన్

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ నెల 15వ తేదీ ఉంగలుడన్ స్టాలిన్ (మీతో స్టాలిన్) పథకాన్ని కడలూరు జిల్లా చిదంబరంలో ప్రారంభించనున్నారు. నవంబరు వరకు అన్ని జిల్లాల్లో ఈ పథకం కింద 10వేల ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తారు. గృహిణులకు ప్రతి నెల రూ.1000 అందజేసే పథకానికి ఈ శిబిరాల్లో మాత్రమే దరఖాస్తులు స్వీకరిస్తారు. అదేవిధంగా శిబిరాల్లో పాల్గొనే మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారు. ఈ ప్రత్యేక శిబిరాల్లో పొందే దరఖాస్తులపై 45 రోజుల్లో తగిన చర్యలు తీసుకుంటారు. పట్టణ ప్రాంతాల్లో 3,768 శిబిరాలు, గ్రామీణ ప్రాంతాల్లో 6,232 శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో సుమారు లక్ష మందికి పైగా స్వచ్ఛంద సేవల ప్రతినిధులు పాల్గొంటారు.

టీఎంబీఎస్పీ ఆవిర్భావం



టీఎంబీఎస్పీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర అధ్యక్షుడిగా వ్యవహరించిన ఆమ్‌స్ట్రాంగ్ సతీమణి పొర్కొడి 'తమిళ్ మానిల బహుజన్ సమాజ్ (టీఎంబీఎస్పీ) అనే కొత్త పార్టీని శనివారం ప్రారంభించి, ప్రజలకు పార్టీ జెండా పరిచయం చేశారు. ఆమ్‌స్ట్రాంగ్ ప్రథమ వర్థంతి సందర్భంగా రెడ్‌హిల్స్ సమీపంలోని పొత్తూరులో ఉన్న స్మారక స్థలంలో ఆమ్‌స్ట్రాంగ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పొర్కొడి టీఎంబీఎస్పీ పేరుతో కొత్త పార్టీ ప్రారంభించారు. నీలం రంగులో ఏనుగు తొండంతో కలం పట్టుకున్న గుర్తుతో డిజైన్ చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించారు. గత ఏడాది జూలై 5న హత్యకు గురైన ఆమ్‌స్ట్రాంగ్ ప్రథమ వర్థంతిని పురస్కరించుకుని నిర్వహించిన మౌన ర్యాలీలో వివిధ పార్టీల నాయకులు సుమారు 2వేల మందికి పైగా కార్యకర్తలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, ఆమ్‌స్ట్రాంగ్ మరణించాక పొర్కొడి బీఎస్పీలో రాష్ట్ర ఆర్గనైజర్‌గా ఎంపికయ్యారు. ఆ పార్టీ అధ్యక్షుడు ఆనందన్ తనకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆరోపిస్తూ పొర్కొడి ఢిల్లీలోని పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి ఫలితం లేని నేపథ్యంలో కొత్త పార్టీని పొర్కొడి ప్రారంభించడం గమనార్హం.

డీఎంకే పథకాలపై విస్తృత ప్రచారం చేయండి

- డిప్యూటీ సీఎం ఉదయనిధి

అడయార్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పెరంబూరు, రాయపురం, ఆర్‌కే నగర్ ప్రాంతాల్లో డీఎంకే యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం స్టాలిన్ అద్భుతంగా పరిపాలన చేస్తున్నారని, ముఖ్యంగా మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. మరో తొమ్మిది నెలల్లో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో డీఎంకే ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేసే సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింతగా వివరించేలా ఇంటింటికి వెళ్ళి విస్తృతంగా ప్రచారం చేయాలని ఆయన కోరారు.

టీవీకే సలహాదారుగా తప్పుకున్న ప్రశాంత్ కిషోర్



టీవీకే ఆవిర్భావ వేడుకల్లో విజయ్‌తో ప్రశాంత్ కిషోర్

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రత్యేక సలహాదారు బాధ్యతల నుంచి రాజకీయ సలహాదారుడు ప్రశాంత్‌కిషోర్ వైదొలగినట్లు టీవీకే నిర్వాహకులు తెలిపారు. ఫిబ్రవరిలో మహాబలిపురంలో జరిగిన టీవీకే ద్వితీయ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ప్రశాంత్ కిషోర్‌ను ఆ పార్టీ సలహాదారుడిగా విజయ్ సభలో పరిచయం చేశారు. ఈ నేపథ్యంలో, 'జన్ సురాజ్' అనే రాజకీయ పార్టీని ప్రశాంత్ కిషోర్ ప్రారంభించి ప్రస్తుతం బిహార్ అసెంబ్లీ ఎన్నికల వ్యవహారాల్లో బిజీగా ఉంటున్నారు. అందువల్ల ఆయన టీవీకే సలహాదారుడి పదవినుంచి తాత్కాలికంగా వైదొలగినట్లు తెలిసింది.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం మాదే

- అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి



ప్రచార లోగో ఆవిష్కరిస్తున్న ఈపీఎస్

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ధీమా వ్యక్తంచేశారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అన్నాడీఎంకే సన్నద్ధమవుతోంది. ఈ ఎన్నికల్లో మిత్రపక్షాల మద్దతుతో మెజారిటీ సీట్లు సాధించి అధికార పీఠమెక్కాలన్న లక్ష్యంతో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈపీఎస్ సోమవారం కోవై జిల్లా మేట్టుపాళయంలో రాష్ట్రవ్యాప్త ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రచారంలో ప్రజల వద్దకు తీసుకెళ్ళాల్సిన అంశాలు, గత అన్నాడీఎంకే ప్రభుత్వం సాధించిన విజయాలు, ప్రవేశపెట్టిన పథకాలు తదితర అంశాలతో రూపొందించిన పాటల క్యాసెట్, ప్రచార లోగో ఆవిష్కరణ కార్యక్రమం శనివారం రాయపేటలో అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాలిగైలో జరిగింది. 'ప్రజలను కాపాడుదాం... రాష్ట్రానికి విముక్తి కలిగిద్దాం' అనే నినాదంతో రెండాకుల గుర్తును చూపే విధంగా లోగో డిజైన్ చేశారు. వీటిని ఆవిష్కరణ సందర్భంగా ఈపీఎస్ తన రాష్ట్రవ్యాప్త పర్యటన వివరాలను మీడియాకు వివరించారు. రాష్ట్రంలో 30యేళ్ళకు పైగా అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో కొనసాగి రికార్డు నెలకొల్పిందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం పట్ల రాష్ట్ర ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, ఈ వాస్తవాన్ని గ్రహించిన పాలకులు ప్రజలను మభ్యపెట్టే విధంగా వ్యవహరిస్తూ రోజుకో నాటకమాడుతున్నారని వ్యాఖ్యానించారు. 30యేళ్ళకు పైగా అధికారంలో కొనసాగిన అన్నాడీఎంకే పాలనలో దేశంలోనే రాష్ట్రాన్ని అన్నిరంగాలను అభివృద్ధి పరిచి అగ్రస్థానంలో నిలిపిన ఘనత గురించి ప్రజలకు వివరించేలా తన పర్యటన ఉంటుందని, డీఎంకే ప్రభుత్వం ప్రజలు ఎదుర్కొన్న కష్ట నష్టాలను ప్రజల్లోకి తీసుకెళ్ళి ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడమే తమ ఏకైక లక్ష్యమన్నారు. సోమవారం కోవై జిల్లా మేట్టుపాళయం నుంచి ప్రారంభించే ఈ ప్రచారం పయనం రాష్ట్రంలోని 234 నియోజకవర్గాల్లో సాగుతుందని, ఈ సమయంలో ప్రజలను ప్రత్యక్షంగా కలిసి డీఎంకే పాలన తీరును వివరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కోశాధికారి దిండుగల్ శ్రీనివాసన్, ఉప ప్రధాన కార్యదర్శులు కేపీ మునుస్వామి, నత్తం విశ్వనాథన్, కార్యాలయ కార్యదర్శి ఎస్పీ వేల్‌మణి, కార్మికుల సంఘ కార్యదర్శి కమల కన్నన్, ప్రిసీడియం కార్యదర్శులు సి.పొన్నయ్యన్, పి.వళర్మతి, గోకుల ఇందిర, బెంజ్‌మెన్, డి.జయకుమార్, మాధవరం మూర్తి, ఆర్ఎస్.రాజేష్ లతో పాటు పార్టీ అనుబంధశాఖల నిర్వాహకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఈపీఎస్‌కు జెడ్‌ప్లస్ భద్రత...

ఎడప్పాడి పళనిస్వామికి జెడ్‌ప్లస్ భద్రత ఏర్పాటైంది. ఈ విభాగంలో 12 మంది కమాండోలు, 52 మంది పోలీసులు బందోబస్తు కల్పిస్తారు. ఈపీఎస్ ఇంటికి ఇటీవల కాలంలో తరచూ బాంబు బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో, ఆయనకు కేంద్రప్రభుత్వం జెడ్‌ప్లస్ భద్రత కల్పించింది.

రాందాస్ లేకుంటే పీఎంకే లేదు

- పీఎంకే గౌరవాధ్యక్షుడు జీకే మణి



చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వన్నియార్ల సంక్షేమం కోసం దశాబ్దాలుగా పాటుపడి పాట్టాలి మక్కల్ కట్చి పేరుతో పార్టీని ప్రారంభించిన పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ లేకుంటే పార్టీయే లేదని ఆ పార్టీ గౌరవాధ్యక్షుడు జీకే మణి వ్యాఖ్యానించారు. దిండివనం తైలాపురం గార్డెన్‌లో శనివారం రాందాస్ అధ్యక్షతన కార్యనిర్వాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీకే మణి, ప్రధాన కార్యదర్శి మురళిశంకర్, కోశాధికారి మన్సూర్ హుసేన్, మహిళా విభాగం నాయకురాలు సుజాత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జీకే మణి మీడియాతో మాట్లాడుతూ... పార్టీలో గత ఏడు మాసాలుగా కొనసాగుతున్న సంక్షోభ పరిస్థితులు సమసిపోవాలనే కోరుకుంటున్నానన్నారు. పీఎంకే ఎమ్మెల్యే అరుళ్‌ను పార్టీ నుండి తొలగించటమే కాకుండా విప్ పదవి నుంచి తొలగించి, కొత్త విప్‌గా శివకుమార్‌ను అన్బుమణి నియమించారని, ఈ మేరకు పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలుసుకున్నానన్నారు. ఓ వైపు పార్టీలో ఎవరినైనా తొలగించాలన్నా, చేర్చుకోవాలన్నా తనకే అధికారం ఉందని ఇటు రాందాస్, అటు అన్బుమణి చెబుతుండటంతో పార్టీ శ్రేణులు ఎవరిమాట వినాలో తెలియక అయోమయంలో ఉన్నారని వాపోయారు. శాసనసభ ఎన్నికలకు పదిమాసాలే సమయం ఉందని, ప్రస్తుతం ఆ ఎన్నికలపై దృష్టిసారించలేక పోతున్నామని, రాందాస్, అన్బుమణి మధ్య మనస్పర్థలు తొలగిపోవాలని ఆకాంక్షిస్తున్నామన్నారు.

విప్ వివాదంలో స్పీకర్ దూరం..

శాసనసభలో పీఎంకే విప్ తొలగింపు వివాదంలో స్పీకర్ అప్పావు ఎలాంటి జోక్యం చేసుకునే అవకాశాలు లేవని సచివాలయ అధికారులు తెలిపారు. రాందాస్ అనుచరుడైన అరుళ్‌ను పార్టీ విప్‌గా తొలగిస్తూ అన్బుమణి ఇచ్చిన ఉత్తర్వు నకలును ఆ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యే స్పీకర్ అప్పావుకు అందజేశారు. అయితే శాసనసభ నిబంధనల ప్రకారం ఐదుగురు సభ్యులు మాత్రమే ఉన్న పీఎంకేని శాసనసభ రాజకీయ పార్టీగా గుర్తింపు ఇవ్వదని, ఈ పరిస్థితుల్లో విప్ తొలగింపు, కొత్త విప్ నియామకం వంటి వివాదాల జోలికి స్పీకర్ వెళ్ళరని సచివాలయ అధికారులు పేర్కొన్నారు.

కుంభకోణం ఫర్నిచర్ షాపులో భారీ అగ్ని ప్రమాదం

- సుమారు రూ. కోటికి పైగా ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుంభకోణం సమీపంలోని ఓ ఫర్నిచర్ షాపులో శనివారం వేకువజాము సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో సుమారు రూ.కోటి విలువైన ఫర్నిచర్ సామగ్రి కాలి బూడిదైంది. కుంభకోణం సమీపం సాకోట్టైలో రాజా అనే వ్యక్తి ఫర్నిచర్ షాపు నడుపుతున్నాడు. ఆ షాపులో ప్లైవుడ్, రెక్జిన్‌తో పలు వస్తువులు తయారు చేసి విక్రయిస్తున్నారు. శుక్రవారం రాత్రి కార్మికులందరూ వెళ్లిన తరువాత యజమాని రాజా షాపును మూసివేసి ఇంటికి వెళ్ళాడు. ఈ నేపథ్యంలో శనివారం వేకువజామున ఆ ఫర్నిచర్ షాపు నుండి దట్టమైన పొగలు రావడం గమనించిన స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరింజన్లతో హుటాహుటిన అక్కడికి చేరుకుని మూడు గంటలపాటు పోరాడి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రూ.కోటి మేరకు ఆస్థినష్టం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని అగ్ని ప్రమాదానికి గల కారణాలను కనుగొనేందుకు ప్రయత్నిస్తున్నారు.



షాపులోపల కాలుతున్న సామగ్రి

పోలీసుల విచారణకు మదురై ఆధీనం గైర్హాజరు



అడయార్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ఇచ్చిన సమన్లకు మదురై ఆధీనం స్పందించలేదు. ఆయనపై నమోదైన కేసుల్లో విచారణకు హాజరుకావాలని కోరుతూ పోలీసులు రెండు దఫాలుగా సమన్లు పంపించగా, ఆయన పట్టించుకోలేదు. పైగా వీడియో కాన్ఫరెన్స్‌లో విచారణకు హాజరయ్యేందుకు అనుమతివ్వాలని మదురై ఆధీనం కోరగా, పోలీసులు నిరాకరించారు. దీంతో మదురై ఆధీనం అరెస్టు తప్పదనే చర్చ జరుగుతోంది. గత మే నెలలో చెన్నై నగర శివారు ప్రాంతమైన కాట్టాంగుళత్తూరులో శైవ సిద్ధాంత మహానాడు జరిగింది. ఇందులో పాల్గొనేందుకు మదురై ఆధీనం మే 2వ తేదీ ఉదయం 9.40 గంటల సమయంలో ఉళుందూరుపేట సమీపంలో కారులో వస్తుండగా, మరికొందరు కారులో వచ్చి తనను హత్య చేసేందుకు ప్రయత్నించారంటూ ఆయన ఆరోపించారు. ఇదే విషయాన్ని మదురై ఆధీనం మహానాడులో, మీడియా సమావేశంలో వెల్లడించారు. దీంతో మదురై ఆధీనం ప్రయాణించిన మార్గంలోని సీసీ ఫుటేజీని పోలీసులు వెల్లడించారు. ఇందులో మదురై ఆధీనం కారే అతివేగంగా వచ్చి, ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేసినట్టుగా తేలింది. ఆయన చేసిన ఆరోపణల్లో నిజానిజాలు వెల్లడికావడంతో చెన్నై నగరానికి చెందిన రాజేంద్రన్ అనే వ్యక్తి పోలీస్ కమిషనర్‌కు ఓ ఫిర్యాదు అందచేశారు. మదురై ఆధీనం చేసిన వ్యాఖ్యల్లో రెండు మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా, మత సామరస్యానికి భంగం కలిగించేలా అసత్యాన్ని ప్రచారం చేశారన్నారు. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు చెన్నై ఈస్ట్ జోన్ సైబర్ క్రైమ్ పోలీసులు మదురై ఆధీనంపై నాలుగు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఆయన్ని విచారించేందుకు సమన్లు పంపి, జూన్ 29వ తేదీ హాజరుకావాలన్నారు. ఈ సమన్లను ఆయన పట్టించుకోలేదు. అలాగే, జూలై 5వ తేదీ హాజరుకావాలని రెండో సారి సమన్లు పంపించారు. అయినా ఆయన పట్టించుకోలేదు. పైపెచ్చు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యేందుకు అనుమతివ్వాలని కోరగా, పోలీసులు నిరాకరించారు. దీంతో ఈ కేసులో మదురై ఆధీనం అరెస్టయ్యే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం సాగుతోంది.

సమాచార దృష్టి

అమిత్‌షా పర్యటన రద్దు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పర్యటన రద్దయ్యింది. ఈ నెల 7న కాట్టాన్‌కొళత్తూరులో జరిగే కార్యక్రమంలో, అదే సమయంలో పీఎంకే నేతలతో రాజీ ప్రయత్నాలు చేపట్టేందుకు ఈ పర్యటన ఎంపిక చేసుకున్నారు. అయితే పీఎంకేలో అన్బుమణి, రాందాస్ మధ్య ఇంకా మనస్పర్థలు కొనసాగుతుండటంతో అమిత్‌షా తన పర్యటన రద్దు చేసుకున్నారని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి.

ఉపకార వేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కల్కి కృష్ణమూర్తి స్మారక ట్రస్ట్ అందించే విద్యా ఉపకారవేతనాలకు ఈ నెల 31వ తేదిలోగా దరఖాస్తులు సమర్పించాలి. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల విద్యార్థులకు ఉపకారవేతనం అందజేస్తుంటారు. ఈ ఏడాది రూ.17 లక్షలు ఉపకారవేతనంగా అందించనున్నారు. ప్లస్ వన్, ప్లస్ టూ, పాలిటెక్నిక్, ఐటీఐ చదువుతున్న పేద విద్యార్థులు www.kalkionline.com అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 31వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది.

తిరుచెందూరుకు ప్రత్యేక బస్సులు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూరు సుబ్రహ్మణ్య ఆలయంలో ఈ నెల 7వతేదీ మహాకుంభాభిషేకం జరుగనుండటంతో ఆ క్షేత్రానికి ప్రత్యేక బస్ సర్వీసులు ప్రారంభమయ్యాయి. ఈ నెల ఎనిమిదో తేదీ వరకూ వివిధ ప్రాంతాల నుంచి తిరుచెందూరుకు వెయ్యి బస్సులు నడుపనున్నట్లు రవాణా సంస్థ అధికారులు తెలిపారు. చెన్నై, తిరుచ్చి, కోయంబత్తూరు, తిరుప్పూరు, సేలం, మదురై, రామేశ్వరం, తూత్తుకుడి, తిరునల్వేలి, నాగర్‌కోవిల్ ప్రాంతాల నుండి సుమారు 600 ప్రత్యేక బస్సులను నడుపుతామని వివరించారు. ఈ బస్సుల కోసం తిరుచెందూరులో మూడు తాత్కాలిక బస్‌స్టేషన్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

తాంబరం-నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక రైలు సేవలు పొడిగింపు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తాంబరం-నాగర్‌కోయిల్ మధ్య ప్రత్యేక వారాంతపు రైలు సేవలు మరో రెండు వారాలు పొడిగిస్తూ దక్షిణ రైల్వే ప్రకటన విడుదల చేసింది. ఆ ప్రకారం, నెం.06012 నాగర్‌కోయిల్-తాంబరం ప్రత్యేక వారాంతపు రైలు ఈ నెల 6,13 (ఆదివారం), మరుమార్గంలో నెం.06011 తాంబరం-నాగర్‌కోయిల్ ప్రత్యేక వారాంతపు రైలు ఈ నెల 7,14 తేదీల వరకు పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

గుమ్మిడిపూండి-అత్తిపట్టు మధ్య రెండు రైలు మార్గాలు

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మార్గంలో, గుమ్మిడిపూండి-అత్తిపట్టు మధ్య రూ.365.42 కోట్లతో మూడు, నాలుగో రైలు మార్గాలు ఏర్పాటుకు రైల్వే బోర్డు అనుమతించింది. ఈ కొత్త మార్గాల ఏర్పాటుతో సబర్బన్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఎలాంటి ఆటంకం లేకుండా నిర్ణీత సమయానికి నడుస్తాయని, కొత్త రైళ్ల సేవలు ప్రారంభించేందుకు కూడా అనుకూలంగా ఉంటుందని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు.

వైద్య సిబ్బంది నియామకాలకు ఉత్తర్వులు

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ప్రారంభించిన 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఒప్పంద ప్రాతిపదికన మొత్తం 534 మంది వైద్యులు, వైద్య సిబ్బంది నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఆ ప్రకారం, 78 మంది వైద్యులు బదిలీ పద్ధతిలో, 50 మంది నర్సులు శాశ్వత ప్రాతిపదికన, 400 సిబ్బందిని తాత్కాలిక పద్ధతిన నియమించనున్నారు. కొత్తగా నియమితులైన వారికి వేతనం, ఇతర రాయితీలు అందించేందుకు అనుమతులు జారీచేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

ఒట్టేరి, విరుగంబాక్కంలో రూ.95 కోట్లతో కాలువల పునర్నిర్మాణం

పెరంబూర్,జూలై5(ఆంధ్రజ్యోతి):ఒట్టేరి. విరుగంబాక్కం కాలువల నిర్మాణాలకు రూ.95 కోట్లు కేటాయించిన చెన్నై కార్పొరేషన్ దీనికి సంబంధించి టెండర్లు ఆహ్వానించింది. నగరం వరద ముంపునకు గురికావడానికి కాలువలు సక్రమంగా లేకపోవడమే కారణమని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో, జలవనరుల శాఖ ఆధీనంలోని 10.80 కి.మీ పొడవున్న ఒట్టేరి కాలువ, 6.70 కి.మీ పొడవున్న విరుగంబాక్కం కాల్వలను రాష్ట్ర ప్రభుత్వం చెన్నై కార్పొరేషన్‌కు అప్పగించింది. ఈ క్రమంలో, ఒట్టేరి కాలువ రూ.67 కోట్లు, విరుగంబాక్కం కాలువలు రూ.30 కోట్లతో పునర్నించాలని చెన్నై కార్పొరేషన్ నిర్ణయించి టెండర్లు విడుదల చేసింది. నైరుతి రుతుపవన వర్షాలకు ముందే పనులు పూర్తిచేయాలని టెండర్లలో కార్పొరేషన్ సూచించింది.

12 నుంచి విద్యుత్ వాహనాల సాంకేతికతపై శిక్షణ

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వాహనాల సాంకేతికత, పనితీరు తదితరాలపై ఈ నెల 10 నుంచి 12వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈకాట్టుతాంగళ్‌లోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇచ్చే శిక్షణలో... విద్యుత్ వాహనాలపై స్పష్టమైన అవగాహన, మోటార్, బ్యాటరీ, కంట్రోలర్, ఛార్జింగ్ సిస్టమ్ ఆపరేషన్, భద్రతా చర్యలు, సర్వీసింగ్ పద్ధతులు, డీలర్‌షిప్ నిర్వహణ, మరమ్మతు దుకాణాలు, విద్యుత్ వాహనాల రంగంలో అందుబాటులో ఉన్న పథకాలు, ప్రోత్సాహకాలు తదితరాలు వివరించనున్నారు. ఈ శిక్షణపై మరిన్ని వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్, 9543773337, 9360221280 అనే నెంబరును పనిదినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు సంప్రదించవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

అక్టోబరు నుంచి సరెండర్ లీవు ప్రయోజనాలు

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ ఉద్యోగులు సరెండర్ సెలవులకు ప్రయోజనం పొందే ప్రక్రియ అక్టోబరు 1వ తేది నుంచి అమలుకానుంది. కొవిడ్ మహమ్మారి సమయంలో ప్రభుత్వం తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొన్న కారణంగా, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ ఒక సంవత్సరం సంపాదన సెలవు సరెండర్ చేసి నగదు ప్రయోజనాలు పొందే విధానం 2021లో నిలిపివేశారు. ఈ విధానం పునఃప్రారంభించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనలు చేపడుతున్నారు. ఈ విషయమై దృష్టి సారించిన ప్రభుత్వం, అక్టోబరు నుంచి ఈ విధానం ప్రారంభించనున్నట్లు ప్రకటించింది. ఆ ప్రకారం, ఏడాదిలో 15 సెలవుల వరకు సరెండర్ చేసి, అందుకు సంబంధించిన వేతనం ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పొందవచ్చని అధికారులు తెలిపారు.

అదనపు కట్న వేధింపులకు మరో అబల బలి

● పెళ్లయిన ఆరు నెలలకే వివాహిత ఆత్మహత్య

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా కూండువాంజేరి వద్ద వరకట్నం వేధింపులు భరించలేక పెళ్ళయిన ఆరుమాసాలకే ఓ యువతి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ యువతి తల్లిదండ్రులు, కుటుంబీకులు, బంధువులు, స్థానికులు ఆసుపత్రి వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. వివరాలిలా... నాగర్‌కోవిల్ సమీపంలోని కరుంగల్ తిక్కనాంకోడు ప్రాంతానికి చెందిన రాబిన్‌సన్ కుమార్తె జెమాలా (26) ఇనయపుత్తన్‌తురైకి చెందిన నితిన్‌రాజ్ (26) గత జనవరిలో ప్రేమ వివాహం చేసుకున్నారు. వేర్వేరు కులాలకు చెందిన వీరి ప్రేమను ఇద్దరి కుటుంబాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఆ తర్వాత వివాహానికి సమ్మతించారు. ఈ నేపథ్యంలో నితిన్‌రాజ్ గత కొద్ది నెలలుగా ఏ పనికి వెళ్లకుండా ఇంటిలోనే గడుపుతూ తరచూ భార్యతో కట్నం కోసం గొడవ పెట్టుకునేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో జెమాలా ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకుని ఆమె తల్లిదండ్రులు నితిన్‌రాజ్ కుటుంబంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ కుమార్తె ఆత్మహత్య చేసుకోవడానికి భర్త, అత్తమామలు వేధింపులే కారణమని ఆరోపించారు. ఈ విషయమై జెమాలా తల్లి పుష్పలత పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కుమార్తె పెళ్ళి సందర్భంగా రూ.7లక్షల నగదు, 50 సవర్ల నగలు కట్నంగా ఇచ్చినట్లు తెలిపారు. రెండు నెలల తర్వాత మరింత కట్నం తేవాలంటూ కుమార్తెను వేధించారని, తన మెడలోని గొలుసు విక్రయించి రూ.5లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. తన కుమార్తె మృతదేహంపై గాయాలున్నాయని, భర్త, అత్తమామలు కలిసి ఆమెను హతమార్చి, ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తన కుమార్తె మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. జెమీలా పెళ్ళయిన ఆరు మాసాలకే ఆత్మహత్య చేసుకోవడంతో ఆర్డీవో కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.



ఆసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న జమీలా కుటుంబీకులు- ఇన్‌సెట్‌లో జమీలా (ఫైల్‌ఫొటో)

కాల పరిమితి వద్దు

అన్నాడీఎంకే కేసుపై త్వరలో విచారణ ● హైకోర్టుకు తెలిపిన ఈసీ

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే పార్టీ అంతర్గత వ్యవహారంపై త్వరలో విచారణ జరుపుతామని, ఇందుకోసం కాల పరిమితి నిర్ణయించవద్దని మద్రాస్ హైకోర్టుకు ఎన్నికల కమిషన్ తెలిపింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శిగా ఎడప్పాడి పళనిస్వామిని ఆ పార్టీ సమావేశంలో ఎన్నుకోవడం, ఆమోదించిన తీర్మానాలను అంగీకరించరాదు, ఈ సివిల్ కేసులు ముగిసే వరకు ఆ పార్టీకి రెండాకుల గుర్తును కేటాయించవద్దని కోరుతూ అందజేసిన ఫిర్యాదులపై కేంద్ర ఎన్నికల కమిషన్ విచారణ జరపడాన్ని వ్యతిరేకిస్తూ ఈపీఎస్ తరుపున మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఎన్నికల గుర్తు కేటాయింపు నిబంధనల ప్రకారం పార్టీ అంతర్గత వ్యవహారంపై ఈసీ జోక్యం కలుగజేసుకోవడంలో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు జారీచేసి ఏడు వారాలు గడిచినా, ఈసీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, ప్రాథమిక విచారణకు గడువు నిర్ణయించాలని కోరుతూ ఈపీఎస్ తరుపున హైకోర్టులో కొత్తగా పిటిషన్ దాఖలైంది.అందులో రాష్ట్ర అసెంబ్లీకి 2026లో జరగనున్న ఎన్నికలకు తమ పార్టీ సిద్ధపడాల్సివుందని, అయితే ఈసీ ప్రాథమిక విచారణ జరపకుండా అనవసరంగా కాలమాపన చేస్తోందని, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో, పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారు దీనిని వారికి అనుకూలంగా చేసుకునే అవకాశముందని ఈపీఎస్ ఆ పిటిషన్‌లో తెలిపారు. ఈ పిటిషన్ గతంలో న్యాయమూర్తులు ఆర్.సుబ్రమణ్యన్, కె.సురేందర్‌లతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు రాగా, ఇరుతరుపు పిటిషనర్ల తరుపున న్యాయవాదులు తమవాదన వినిపించారు.ఈనేపథ్యంలో, శుక్రవారం ఈ ధర్మాసనం ముందుకు ఈకేసు మళ్లీ విచారణకు వచ్చింది. అన్నాడీఎంకే కేసును వీలైనంత త్వరలో విచారణ జరిపి నిర్ణయం తీసుకుంటామని, ఇందుకు కాల పరిమితి నిర్ణయించవద్దని ఎన్నికల కమిషన్ తరుపు సీనియర్ న్యాయవాది నిరంజన్ కోరారు. న్యాయస్థానంలో దాఖలు చేసిన కేసులకు సంబంధించి నకళ్లు పంపిణీ చేయలేదని మాజీ ముఖ్యమంత్రి ఓపీఎస్, పుహళేంది తరపు న్యాయవాదులు తెలిపారు. ఇందుకు అంగీకరించిన న్యాయమూర్తుల బెంచ్ వారికి నకళ్లు పంపిణీ చేయాలని ఆదేశించి, కేసు తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పారిశుధ్య కార్మికురాలి నిజాయితీ

● రూ.35 లక్షల విలువైన నగలు పోలీస్‌స్టేషన్‌లో అప్పగింత



జయమణిని అభినందిస్తున్న పోలీసు అధికారులు

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తనకు దొరికిన పెట్టెలోని రూ.35 లక్షల విలువైన నగలను పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన పారిశుధ్య కార్మికురాలిని పోలీసు అధికారులు అభినందించారు. స్థానిక మాడంబాక్కం ప్రాంతానికి చెందిన రామకృష్ణన్-మీనాక్షి దంపతులు ఈ నెల 2వ తేది అయ్యపాక్కంలోని కల్యాణ మండపంలో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. కార్యక్రమం తరువాత ఇంటికి బయల్దేరిన వారు, తాము తెచ్చిన రూ.35 లక్షల విలువైన 20 సవర్ల నగలు ఉంచిన పెట్టెను మండపంలోని పెళ్లి కుమారుడి గదిలోని మంచం కింది ఉంచిన విషయం మరిచిపోయారు. మండపాన్ని శుభ్రం చేసే తిరుచ్చికి చెందిన జయమణి, మంచం కింద పెట్టెను గమనించి మేనేజర్‌కు అందజేయగా, ఆయన తిరుముల్లైవాయల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిజాయితీగా నగలు అప్పగించిన జయమణిని ఆవడి ఏసీపీ జమన్ జమాల్ శాలువతో సత్కరించి ప్రోత్సాహక నగదు అందించారు. అలాగే, నగల యజమాని రామకృష్ణన్ దంపతులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నగల పెట్టె అప్పగించారు. వారిద్దరు జయమణిని అభినందించడంతో పాటు బంగారు ఉంగరాన్ని బహుమతిగా అందజేశారు.

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

వైద్యకళాశాలల డీన్‌ల నియామక రద్దును సమర్థించిన న్యాయస్థానం

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అప్పీలు పిటిషన్‌ను తోసిపుచ్చిన మద్రాసు హైకోర్టు, 14 ప్రభుత్వ వైద్యకళాశాల డీన్‌ల నియామకాలు రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును సమర్థించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాలల్లో డీన్ పదవులకు అర్హులైన 26 మంది ప్రొఫెసర్ల జాబితాపై రాష్ట్ర ప్రభుత్వం ఆక్షేపణ తెలిపింది. కానీ, అంతకు ముందే 14 ప్రొఫెసర్లకు పదోన్నతి కల్పించి డీన్‌లుగా నియమిస్తూ, 2024 అక్టోబరు 3వ తేది ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ ప్రొఫెసర్ మనోన్మణి సహా నలుగురు మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారించిన సింగిల్ జడ్జి... మనోన్మణి వాదన పరిగణలోకి తీసుకుని 14 మంది ప్రభుత్వ వైద్యకళాశాల డీన్‌ల నియమాకం రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ దాఖలైన అప్పీలు పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు... 14 మంది నియమాక ఉత్తర్వులు సింగిల్ జడ్జి రద్దు చేయడం సబబేనంటూ, అప్పీలు పిటిషన్ తోసిపుచ్చింది. అలాగే, సింగిల్ జడ్జి ఉత్తర్వుల ఆధారంగా, నాలుగు వారాల్లో ప్రభుత్వ వైద్యకళాశాలలకు డీన్ పదవికి పదోన్నతుల జాబితా తయారుచేసి, నియామకాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది.

సీబీఐ విచారణ జాప్యం

వాచ్‌మన్ కేసులో సీబీసీఐడీ చాలు ● కుటుంబ తరపు న్యాయవాది విజ్ఞప్తి

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మడప్పురం ఆలయ వాచ్‌మన్ అజిత్ కుమార్ హత్య కేసు సీబీఐ విచారణ జరిపితే జాప్యం జరుగుతుందని, న్యాయస్థానం పర్యవేక్షణలో సీబీసీఐడీ విచారణ చాలని అజిత్‌కుమార్ కుటుంబం తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. శివగంగ జిల్లా తిరుభువనం సమీపంలోని మడప్పురం భద్రకాళి అమ్మవారి ఆలయ వాచ్‌మన్ అజిత్ కుమార్ నగలు దొంగించాడనే ఫిర్యాదుతో, ప్రత్యేక పోలీసు బృందం అతడిని విచారించే సమయంలో మృతిచెందాడు. ఈ కేసు సీబీఐకి సిఫారసు చేస్తూ ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ క్రమంలో, అజిత్‌కుమార్ కుటుంబం తరఫున విచారణకు హాజరవుతున్న న్యాయవాది గణేష్‌కుమార్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... అజిత్‌కుమార్‌పై దాడిచేసిన ఆరుగురు పోలీసులు, సీఐ, డీఎస్పీ, ఎస్పీ తదితరులు గత నెల 27 నుంచి 30వ తేది ఎవరెవరితో సెల్‌ఫోన్‌లో మాట్లాడారు అనే వివరాలు కోరామని, ఈ వివరాల ద్వారా వాస్తవం వెలుగులోకి వచ్చే అవకాశముందన్నారు. సాధారణంగా సీబీఐ విచారిస్తున్న కేసుల్లో చాలా జాప్యం జరుగుతోందని, అందువల్ల ఈ కేసులో సీబీసీఐడీ విచారణ సరిపోతుందని న్యాయవాది గణేష్‌కుమార్ తెలిపారు.

రూ.2కోట్ల విలువైన ఏనుగు దంతాల స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఏనుగు దంతాలను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న రూ.2 కోట్ల విలువైన ఏనుగు దంతాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు, మహిళ సహా 8 మందిని అరెస్ట్ చేశారు. చెంగల్పట్టు సమీపంలోని భరనూరు మీదుగా ఏనుగు దంతాలు స్మగ్లింగ్ చేస్తున్నారనే సమాచారంతో, అటవీ శాఖ అధికారులు ఆ ప్రాంతంలో ఉన్న టోల్ గేట్ వద్ద నిఘా వేశారు. ఆ మార్గంలో అనుమానాస్పదంగా వచ్చిన ఓ కారు ఆపి తనిఖీ చేశారు. కారులో సీటు కింద దాచిన రూ.2 కోట్ల విలువైన ఏనుగు దంతాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారులో ప్రయాణిస్తున్న మహిళ సహా 8 మందిని అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారు చెన్నై, బెంగళూరుకు చెందిన వారుగా విచారణలో తెలిసింది.

బన్నారి రహదారిలో ఏనుగు సంచారం



చెన్నై, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలోని బన్నారి అమ్మన్ ఆలయ సమీపంలోని సత్తి - మైసూరు జాతీయ రహదారిలో అడవి ఏనుగు సంచరించడంతో ఆ మార్గంలో వెళ్తున్న వాహనచోదకులు భయాందోళనలకు గురయ్యారు. శుక్రవారం రాత్రి ఆ రహదారిలో ఓ వ్యక్తి కారులో వెళ్తుండగా రహదారి మధ్యనే అడవి ఏనుగు నడుచుకుంటూ వచ్చింది. ఆ వ్యక్తి కారు హారన్ మోగించడంతో ఆ ఏనుగు ఆయనను తరుముకుంటూ వెళ్లింది. దీంతో ఆ వ్యక్తి కారును వేగంగా రివర్స్ తీసుకుని వెళ్లారు. కాసేపయ్యాక ఆ ఏనుగు పక్కనే ఉన్న అడవిలోకి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఆ రహదారిలో వాహనాల రాకపోకలు యధావిధిగా ప్రారంభమయ్యాయి.


ఆయుర్వేద మందుల దిగుమతికి లైసెన్స్ తప్పనిసరి

● మద్రాసు హైకోర్టు

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద మందుల దిగుమతికి లైసెన్స్ తప్పనిసరి అని మద్రాసు హైకోర్టు స్పష్టంచేసింది. సింగపూర్ నుంచి దిగుమతి చేసుకుంటున్న తైలం సహా పలు మందులను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ ఆక్సెన్ కంపెనీ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి సెంథిల్‌కుమార్ రామ్మూర్తి... సుప్రీంకోర్టు తీర్పు ఆధారంగా, కొరారి తైలం కస్టమ్స్ డ్యూటీ పరిధిలోకి వస్తుందని, దిగుమతి చేసుకున్న ఆయుర్వేద మందులు తనిఖీకి లోబడి ఉంటాయన్నారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ చట్టం ఆయుర్వేద ఉత్పత్తులకు కూడా వర్తిస్తుందంటూ, అన్నిరకాల ఔషధ ఉత్పత్తుల దిగుమతికి లైసెన్స్ తప్పనిసరిగా పొందాలని ఉత్తర్వులు జారీచేశారు.ఆయుర్వేద మందులకు లైసెన్స్ పొందేలా దరఖాస్తు నమోదులోని పాత విధానాలు మార్చాలని సూచించిన న్యాయమూర్తి, పిటిషనర్ వస్తువులు తనిఖీ చేసి విడుదల చేయాలని ఉత్తర్వులు జారీచేశారు.

రీటోటలింగ్‌తో టెన్త్‌లో ర్యాంకు తారుమారు

ఐదు మార్కులు కలవడంతో మొదటిస్థానంలో పొల్లాచ్చి విద్యార్థి



విద్యార్థి గురుదీప్

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పబ్లిక్ పరీక్షల రీ టోటలింగ్‌తో 5 మార్కులు పొందిన పొల్లాచ్చికి చెందిన విద్యార్థి గురుదీప్ రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకులో నిలిచాడు. వివరాలిలా వున్నాయి... ఆచ్చిపట్టి గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గురుదీప్, పబ్లిక్ పరీక్షల్లో తమిళంలో 99, ఇంగ్లీషు, మ్యాథ్స్, సైన్స్ పాఠ్యాంశాల్లో 100 మార్కులు, సోషల్ సైన్స్‌లో 95 మార్కులు మొత్తం 494 మార్కులు పొందాడు. అయితే తనకు ఇంకా ఎక్కువ మార్కులు రావాల్సి వుందని భావించిన గురుదీప్.. రీటోటలింగ్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అతనికి సైన్స్‌లో మరో 5 మార్కులు కలిసి మొత్తం 100 మార్కులు వచ్చాయి. దీంతో అతనికి మొత్తం 499 మార్కులు రావడంతో పాటు రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకర్‌గా నిలిచాడు.

నేడు, 10న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వీక్షించే అవకాశం

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): భూమి నుంచి 400 కి.మీ ఎత్తులో ఉన్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఆదివారం, ఈ నెల 10న నగర ప్రజలు వీక్షించవచ్చని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు బసచేస్తూ పరిశోధనలు చేపట్టేలా 1988లో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం ఏర్పాటుచేశారు. ఈ కేంద్రం భూమి చుట్టూ తిరుగుతున్న ఓ పెద్ద అంతరిక్ష నౌకలా పనిచేస్తుంది. అమెరికా, రష్యా, యూరప్, జపాన్, కెనడా దేశాలు ఏర్పాటు చేసిన ఈ అంతరిక్ష కేంద్రం భూమికి సుమారు 400 కి.మీ ఎత్తులో తిరుగుతోంది. రోజుకు 16 సార్లు భూమి చుట్టూ తిరుగుతుంది. భూమి చుట్టూ ఒకసారి తిరగడానికి 90 నిమిషాలు పడుతుంది. ఈ కేంద్రంలో ప్రస్తుతం భారత వ్యోమగామి సుబాన్ శుక్లా సహా నలుగురు పరిశోధనలు చేస్తున్నారు. ఈ అంతరిక్ష కేంద్రం భూమి చుట్టూ తిరిగే కొన్ని సమయాల్లో కేవలం నేత్రాల ద్వారా వీక్షించవచ్చు. ఈ కేంద్రాన్ని ఏ ప్రాంతంలో ప్రజలు వీక్షించవచ్చు అనే విషయాన్ని నాసా వెల్లడించింది. ఆ ప్రకారం, ఆదివారం నుంచి ఈ నెల 12వ తేది వరకు దేశంలోని పలు ప్రాంతాల్లో ఈ కేంద్రాన్ని చూడవచ్చు. రాత్రి 8 నుంచి 8.06 గంటల వరకు చెన్నై, తిరుచ్చి, మదురై, కోవై సహా దేశంలోని పలు నగరాల్లో ఈ కేంద్రాన్ని వీక్షించవచ్చు. అలాగే, 10వ తేది తెల్లవారుజామున 4.58 నుంచి 5.06 గంటల వరకు చెన్నై నగర ప్రజలు వీక్షించవచ్చు. కొన్ని సెకన్లు మాత్రమే ఈ కేంద్రాన్ని వీక్షించే అవకాశముందని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు.

10కి పెరిగిన బాణసంచా ప్రమాద మృతులు

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విరుదునగర్ జిల్లా సాత్తూరులో బాణసంచా కర్మాగారంలో ఈ నెల 1వ తేదీ సంభవించిన పేలుడు ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి పెరిగింది. సాత్తూరులోని బాణసంచా కర్మాగారంలో సుమారు వంద మందికి పైగా పనిచేస్తున్నారు. గత మంగళవారం ఉదయం ఆ కర్మాగారంలో కెమికల్ కలిపే గదిలో పేలుడు సంభవించి 9 మంది కార్మికులు మరణించారు. గాయపడిన వారిని మదురై ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. వారిలో అలగురాజా శనివారం ఉదయం మృతిచెందడంతో, ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి పెరిగింది.

కుడి కాలికి బదులు ఎడమకాలికి శస్త్ర చికిత్స

● విల్లుపురం ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్వాకం

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కుడి కాలికి శస్త్ర చికిత్స చేయించుకునేందుకు చేరిన ఓ బస్ కండక్టర్‌కు ఎడమ కాలికి శస్త్ర చికిత్స చేసిన విల్లుపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులతో రోగి కుటుంబసభ్యులు వాగ్వివాదానికి దిగారు. వివరాలిలా... విల్లుపురం జిల్లా వినాయకపురానికి చెందిన నల్లతంబి కుమారుడు మారిముత్తు (46) ప్రస్తుతం విల్లుపురం-పుదుచ్చేరి మార్గంలో నడిచే ఓ ప్రైవేటు బస్సులో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన కొన్ని నెలలుగా కుడి కాలులో వాపు ఏర్పడి నొప్పి భరించలేక గత 30వ తేదీ చికిత్స కోసం విల్లుపురం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆయనకు ఎంఆర్ఐ స్కానించగ్ చేసిన వైద్యులు కుడికాలులో రెండు ప్రాంతాల్లో శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించారు. ఆ ప్రకారం శుక్రవారం ఉదయం 8 గంటలకు మారిముత్తును ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్ళి మత్తు ఇంజక్షన్ ఇచ్చి శస్త్ర చికిత్స చేశారు. అనంతరం మధ్యాహ్నం 12.45 గంటలకు అతనిని వార్డుకు తీసుకెళ్ళారు. గంట అనంతరం స్పృహలోకి వచ్చిన మారిముత్తు కళ్లు తెరచిచూసి, దిగ్భ్రాంతికి గురైయ్యాడు. ఈ నేపథ్యంలో మారిముత్తు కుటుంబసభ్యులు, బంధువులు వైద్యులతో వాగ్వాదానికి దిగారు. ఇందుకు క్షమాపణ తెలిపిన వైద్యులు సోమవారం ఎడమ కాలికి శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఇందుకు అంగీకరించని మారిముత్తు బంధువులు ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ ఆస్పత్రి ప్రాంగణంలో ధర్నా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు బస్సు మోటార్ బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతిచెందారు. కారైక్కుడి సమీపంలో వస్తున్న ప్రైవేటు బస్సు టైర్ పేలిపోయింది. దీంతో, అదుపుతప్పిన బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న మణికంఠన్ (36), విజయకుమార్ (33) తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కోవైలో రోడ్డుపై కారుదగ్ధం



మంటల్లో చిక్కుకుని దగ్ధమవుతున్న కారు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరు ప్రధాన రహదారిలో వెళ్తున్న ఓ కారు ఉన్నట్టుండి మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. ఈ ప్రమాదంలో కారు యజమాని ప్రాణాలతో బయటపడ్డాడు. నల్లంపాళయం రామసామి నగర్‌కు చెందిన జోతిరాజ్ రాష్ట్రరవాణా సంస్థలో డ్రైవర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన తన కారులో ఇంటికి వెళుతుండగా ట్యాంక్ నుండి పెట్రోలు రోడ్డుపై కారింది. ఆ విషయాన్ని గమనించి వాహన చోదకులు జోతిరాజ్‌కు తెలిపారు. ఆ తర్వాత ఆయన కారు ఆపి పెట్రోలు కారకుండా లాక్‌చేసి, గ్యాస్‌తో కారు నడిపేందుకు ఆన్ చేశారు. వెంటనే కారు కింద కారుతున్న పెట్రోలుకు నిప్పంటుకుని క్షణాల్లో మంటలు చెలరేగాయి. వెంటనే జోతిరాజ్ కారు నుంచి కిందకు దూకి పరుగులు తీశాడు. నడిరోడ్డులో ఆ కారు మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. ఈ సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను తీవ్రంగా పోరాడి ఆర్పివేశారు.

ప్రభుత్వాస్పత్రిలో ఇరువర్గాల ఘర్షణ



ఘర్షణలకు పాల్పడుతున్న దృశ్యం

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో ఇరువర్గాలు పరస్పర దాడులకు పాల్పడడం కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు... కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలోని గ్రామానికి చెందిన రెండు వర్గాలు పాతకక్షల కారణంగా ఇటీవల పరస్పర దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడిలో గాయపడిన ఒక వర్గం వారు ఉళుందూర్‌పేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో, మరో వర్గం వారు చికిత్స కోసం ఈ ఆసుపత్రికి రావడాన్ని గమనించి, ఇప్పటికే చికిత్స పొందుతున్న వారు వారిపై దాడిచేశారు. అందుకు వారు కూడా ప్రతిదాడులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో వైద్యులు, సిబ్బంది, రోగులకు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి విచారిస్తున్నారు.

నాటు బాంబు తయారు చేస్తూ రీల్స్

● నలుగురు రౌడీల అరెస్ట్

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నాటు బాంబు తయారుచేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్ట్ చేసిన నలుగురు రౌడీలను పోలీసులు అరెస్ట్ చేశారు. విల్లుపురం జిల్లా కోటకుప్పం బర్కత్ నగర్ వాటర్ ట్యాంక్ సమీపంలోని తోటలో రౌడీలున్నట్లు శుక్రవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. కోటకుప్పం సీఐ నేతృత్వంలో పోలీసులు ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే, వారి నుంచి నాటు బాంబు తయారీకి వినియోగించే పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.. విచారణలో... వారు చిన్న కోటకుప్పం ఎంజీఆర్ నగర్‌కు చెందిన అప్పు అలియాస్ జవహర్ (26), అయ్యనార్ ఆలయ ప్రాంతానికి చెందిన మహ్మద్ హుసేన్ (28), రహమత్ నగర్‌కు చెందిన మహ్మద్ షరీఫ్ (25), పుదుచ్చేరి సామిపిళ్లా తోటకు చెందిన శరవణన్ (30) అని, నలుగురు నాటు బాంబు తయారుచేసి, దానిని పేల్చుతూ వీడియో తీసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసినట్లు, అప్పు, హుసేన్, షరీఫ్ తదితరులపై హత్య కేసు, శరవణన్‌పై దాడి కేసు ఉన్నట్లు తెలిసింది. దీంతో, నలుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

అత్యాచారం కేసులో యువకుడికి యావజ్జీవ జైలు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడికి కోర్టు యావజ్జీవ జైలుశిక్ష విధించింది. స్థానిక మడిపాక్కంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న బాలికను అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న యేసు (20) అనే యువకుడు 2018 మార్చి 11న ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి మడిపాక్కం పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు చెంగల్పట్టు పోక్సో కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, నేరారోపణ రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నసీమాభాను ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, బాధిత బాలికకు రూ.4 లక్షల పరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు.

తమిళ తెరపై మరో మాలీవుడ్ భామ

చిత్రజ్యోతి

తన నటనతో మంచి గుర్తింపు పొందిన మలయాళ నటి మీనాక్షి దినేష్ 'లవ్ మ్యారేజ్' అనే చిత్రంతో కోలీవుడ్‌కు పరిచయమయ్యారు. ఆమె నటించిన తొలి చిత్రమే ఘన విజయం సాధించడంతో ఆమె సంతోషానికి అవధుల్లేకుండా పోయాయి.తమిళంలో తన సినీ ఎంట్రీపై ఆమె స్పందిస్తూ, 'నేను నటించిన తొలి చిత్రంతోనే తమిళ ప్రేక్షకుల నుంచి ఇంత ఆదరణ లభిస్తుందని ఊహించ లేదు. 'లవ్ మ్యారేజ్'లో నా పాత్ర నాలోని కొత్త కోణాన్ని ఆవిష్కరింపజేసింది. ఈ పాత్ర కోసం నన్ను ఎంచుకున్న చిత్ర బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు. వైవిధ్యమైన, చాలెంజింగ్‌తో కూడిన పాత్రల్లో నటించాలని ఉంది. తమిళంలో నా అభిమాన హీరో సూర్య. ఆయనతో కలిసి నటించాలని వుంది. ప్రతి సినిమాలో ఆయన కొత్తగా కనిపిస్తారు. తనను తాను ఆవిష్కరించుకుంటారు. అలాంటి వ్యక్తి నుంచి ఎంతో నేర్చుకోవచ్చు. అందుకే సూర్య చిత్రంలో నటించాలనివుంది. అలాగే, నాకంటూ ప్రత్యేక గుర్తింపు ఉండే పాత్రల్లో నటించాలని వుంది. స్టీరియోటైప్‌లను బద్దలు కొట్టి, ఆకర్షణీయమైన పాత్రలను పోషించాలన్న ఆసక్తి వుంది' అని అన్నారు.


మీనాక్షి దినేష్

విడుదలకు ముందే రికార్డులు సృష్టిస్తున్న 'కూలీ'

యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'కూలీ' చిత్రం విడుదలకు ముందే సరికొత్త రికార్డులను నెలకొల్పుతోంది. ఇప్పటికే ఈ మూవీ విదేశీ హక్కులు రికార్డు స్థాయి ధరకు అమ్ముడు పోగా, ఈ చిత్రాన్ని ఏకంగా వందకు పైగా దేశాల్లో విడుదల చేయనున్నారు. ఒక ప్రాంతీయ భాషా చిత్రం ఈ స్థాయిలో విడుదలైన దాఖలాలు లేవు. కోలీవుడ్ అగ్రహీరో విజయ్ నటించిన 'ది గోట్' మూవీని 40కి పైగా దేశాల్లోనూ, టాలీవుడ్ హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దేవర' మూవీని 90కి పైగా దేశాల్లో రిలీజ్ చేశారు. కానీ, 'కూలీ' మూవీని ఏకంగా వందకు పైగా దేశాల్లో విడుదల చేయనున్నారు. అంతర్జాతీయ చలనచిత్ర పంపిణీల్లో ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రఖ్యాత సినీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ హంసిని ఎంటర్‌టైన్మెంట్ ఈ మూవీ విదేశీ పంపిణీ హక్కులను సొంతం చేసుకుంది. ఇప్పటివరకు ఈ సంస్థ 130కి పైగా చిత్రాలను విడుదల చేసి, అనేక భారతీయ చిత్రాలను దేశ విదేశాల్లోని ప్రేక్షకులకు చేరువచేసింది. కాగా, ఒక తమిళ చిత్రం వంద దేశాల్లో విడుదలకానుండటం ఇదే తొలి సారి కావడం గమనార్హం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం ఆగస్టు 14వ తేదీన చిత్రం విడుదలకానుంది. ఇందులో రజనీకాంత్‌తో పాటు అక్కినేని నాగార్జున, సత్యరాజ్, అమీర్ ఖాన్, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, శృతి హాసన్ తదిరులు నటించారు. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించారు.


'కూలీ'లో రజనీకాంత్

జియో హాట్‌స్టార్‌లో 'గుడ్ వైఫ్స్' స్ట్రీమింగ్

జియో హాట్‌స్టార్ స్పెషల్‌గా 'గుడ్ వైఫ్స్' పేరుతో వెబ్ సిరీస్ రూపొందించింది. జాతీయ అవార్డు గ్రహీత ప్రియమణి, సంపత్ రాజ్ జంటగా నటించిన ఈ వెబ్ సిరీస్.. శుక్రవారం నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. ఈ వెబ్ సిరీస్ ద్వారా రేవతి తమిళ ఓటీటీలో దర్శకురాలిగా తొలిసారి పరిచయమయ్యారు. ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్‌ను పురస్కరించుకుని చిత్ర బృందం నగరంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఎడిటర్ కిషన్, నటీనటులు మేఘా రాజన్, అమృత, ఆరి, సంపత్, అమ్మా క్రియేషన్స్ అధినేత శివ, నటి ప్రియమణి, నటుడు సంపత్, దర్శకురాలు రేవతి తదితరులు పాల్గొన్నారు. దర్శకురాలు మాట్లాడుతూ, 'గతంలో సినిమాలకు దర్శకత్వం వహించినప్పటికీ.. వెబ్ సిరీస్ తెరకెక్కించేందుకు వెనుకంజ వేశాను. ఒక సినిమా రెండున్నర గంటల తర్వాత ముగింపు చెబుతాం. కానీ, వెబ్ సిరీస్ అలాకాదు. పైగా నేను రచయితను కాదు. ఈ స్టోరీని తమిళ ప్రేక్షకులకు చేరువచేయాలనే లక్ష్యంతో రచయిత హలీదా కథ సిద్ధం చేశారు. అందులో కొన్ని చేర్పులు మార్పులు చేసి దర్శకత్వ బాధ్యతలు చేపట్టాను' అని పేర్కొన్నారు.నటి ప్రియమణి మాట్లాడుతూ, 'అది సినిమానా లేక వెబ్ సిరీసా అనే విషయాన్ని మరచిపోయి, మీకు వచ్చే ప్రతి అవకాశాన్ని జారవిడుచుకోవద్దు. తన జీవితంలో ఎదురయ్యే కష్టనష్టాలను ధార్మిక అనే పాత్రధారి ఎలా ఎదుర్కొన్నారన్నదే ఈ వెబ్ సిరీస్ స్టోరీ. ప్రతి ఒక్కరికీ ఆమె ధన్యవాదాలు' తెలిపారు.


'గుడ్ వైఫ్స్' వెబ్ సిరీస్ బృందం


దర్శక నిర్మాతలను అభినందిస్తున్న ఎడిటర్ మోహన్, మోహన్ రాజా

కోలీవుడ్‌లో కొత్త నిర్మాణ సంస్థ 'డీకేఎస్ ప్రొడక్షన్స్'

సినీ నిర్మాణ రంగంలోకి డ్రీమ్ నైట్ స్టోరీస్ (డీకేఎస్) అనే సంస్థ అడుగు పెట్టింది. ఈ సంస్థ తొలి ప్రాజెక్టు ప్రొడక్షన్ నెం.1 పేరుతో శుక్రవారం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. ఇందులో సినీ ప్రముఖులు ఎడిటర్ మోహన్, నిర్మాత పీఎల్ తేనప్పన్, నటుడు సతీష్, దర్శకులు తిరుకుమరన్, విజయ్ మిల్టన్, భాగ్యరాజ్ కన్నన్, మోహన్ రాజా తదితరులు పాల్గొన్నారు. 'మాన్ కరాటే', 'రెమో', 'గెత్తు' వంటి చిత్రాలతో పాటు త్వరలో విడుదలకానున్న 'రెట్టతల' చిత్రానికి మాటల రచయితగా పనిచేసిన లోగన్ ఈ సినిమాకు దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఈ సినిమా ప్రారంభోత్సవ పూజా కార్యక్రమాన్ని సీఎస్కే ఆటగాడు శివం దూబే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఇది ఒక చారిత్రాత్మక క్షణం. ఇటువంటి చిత్ర ప్రాజెక్టు ప్రారంభంలో ఉండటం గర్వంగా ఉంది. దర్శక నిర్మాతలకు శుభాకాంక్షలు' తెలిపారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ నిర్మాణ సంస్థ తెరకెక్కించిన అనేక చిత్రాలకు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా ఉన్న టి.శరవణ కుమార్ ఈ సినిమాకు నిర్మాత. ఇందులో నటించే నటీనటులు ఇతర వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు.





SUNDAY SPECIAL



'సొగసు చూడ తరమా...!' నగర వనం.. అంతటా పచ్చదనం

- కోయంబేడు ఎకో పార్క్‌కు నూతన సొబగులు

పెరంబూర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు ఎకో పార్క్ సరికొత్త అందాలు సంతరించుకుంది. పచ్చదనంతో నిండి ఉన్న ఈ పార్క్‌లో ప్రత్యేక వాకింగ్ ట్రాక్, వాటర్ ఫౌంటైన్లు, యోగా కేంద్రం, స్కేటింగ్ రింగ్, పిల్లలకోసం ప్రత్యేక క్రీడా మైదానం తదితరాలున్నాయి. నగర ప్రజలు సెలవు రోజుల్లో కుటుంబ సభ్యులతో సరదాగా వెళ్లేందుకు మెరీనా బీచ్, బీసెంట్ నగర్ బీచ్, వండలూరు జూ పార్క్ తదితర కొన్ని ప్రాంతాలు మాత్రమే ఉన్నాయి. కానీ, ఆయా ప్రాంతాలకు వెళ్లి వచ్చేందుకు ప్రయాణ సమయం ఎక్కువగా ఉండడంతో, ఆయా ప్రాంతాలకు వెళ్లి సంతోషంగా గడిపేందుకు సమయం సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో, నగరంలోని ఫ్లై ఓవర్ల కింది ప్రాంతాల్లో ఎకో పార్క్ ఏర్పాటుచేయాలని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) నిర్ణయించింది. ఇప్పటికే కత్తిపార జంక్షన్, ఐటీ కారిడార్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఎకో పార్క్‌లకు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది.

రూ.8.6 కోట్లతో...

స్థానిక పూందమల్లి హైరోడ్డు కోయంబేడు ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలో రూ.8.6 కోట్లతో ఎకో పార్క్ ఏర్పాటుపనులు తుదిదశకు చేరుకున్నాయి. నగరం మధ్యలో ఉన్న ఈ ప్రాంతం నిత్యం వాహనాల, ప్రజల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. ఈ ప్రాంతంలోని ఫ్లై ఓవర్ కింద చుట్టుపక్కల ప్రాంతాలు కలుపుతూ 3.59 ఎకరాల్లో ఈ పార్క్ నిర్మిస్తున్నారు. రకరకాల మొక్కలతో పచ్చదనం సంతరించుకుని, ప్రత్యేక వాకింగ్ ట్రాక్, మొక్కలు మధ్య వలుపులు తిరిగే కాలిబాట, స్కేటింగ్, యోగా కేంద్రాలు, వాటర్ ఫౌంటైన్లు, పిల్లలు ఆడుకునే వస్తువులు సహా పలు క్రీడా ఉపకరణాలు ఏర్పాటవుతున్నాయి. ఈ పార్క్ త్వరలో ప్రజల అందుబాటులోకి రానుందని సీఎండీఏ అధికారులు తెలిపారు.

ప్రత్యేక అందాలు సంతరించుకుంటున్న ఎకో పార్క్

తిరుచెందూర్‌లో వెనక్కి వెళ్లిన సముద్రం



చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ సముద్రతీరం 50 అడుగులు వెనక్కి వెళ్లడంతో పాచిపట్టిన రాళ్లు, సముద్ర జీవులు కనిపించాయి. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ సమీపంలో అమావాస్యం పౌర్ణమి రోజుల్లో సముద్రం వెనక్కి వెళ్లి, కొంతసేపటి తర్వాత యథా స్థానానికి చేరుతుంది. ఈ నేపథ్యంలో పౌర్ణమి ఇంకా రెండు రోజులుండగా శనివారం ఉదయం తిరుచెందూర్ ఆలయ ఆలయం సమీపంలోని సముద్రం సుమారు 50 అడుగుల వెనక్కి వెళ్లింది. ఆ సమయంలో అక్కడ పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు, పర్యాటకులు బయటపడిన రాళ్లపై నిలబడి సెల్ఫీ తీసుకున్నారు. మరికొందరు సముద్రం వెనక్కి వెళ్లడంతో కనిపించిన చేపలు పట్టారు. కొద్దిసేపటి తర్వాత సముద్రం యథాస్థితికి చేరుకుంది.

ఘనంగా అర్జున తపస్సుమాను

తిరుత్తణి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని వడకుప్పంలో ద్రౌపదియమ్మన్ సమేత ధర్మరాజస్వామి ఆలయంలో శనివారం అర్జున తపస్సుమాను ఉత్సవం వైభవంగా జరిగింది. గత నెల 26న ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం ఆలయ అర్చకులు స్వామివార్ల ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం ఉదయం 9 గంటలకు ఆలయ బయట జానపద పద్యాలు పాడుతూ అర్జునుడి వేషధారణతో యువకుడు తపస్సుమాను అధిరోహించారు. ఈ ఉత్సవాన్ని వీక్షించేందుకు తిరువళ్లూరు జిల్లావ్యాప్తంగానే కాకుండా రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన నగరి, చిత్తూరు, కార్వేటినగరం తదితర ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చారు. చివరగా సంతానంలేని మహిళల కోసం అర్జునుడి వేషధారణలో ఉన్న వ్యక్తి తపస్సుమానుపై నుంచి పూజలో ఉంచిన నిమ్మపండ్లను భక్తులపై విసిరారు. అనంతరం భక్తులు దౌపదీ సమేత ధర్మరాజస్వామిని దర్శించుకున్నారు.

తపస్సుమాను ఎక్కుతున్న అర్జున వేషధారి




అత్యాధునిక డయాలసిస్ కేంద్రానికి సన్నాహాలు


ఒప్పంద కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేదల కోసం అత్యాధునిక డయాలసిస్ కేంద్రమైన 'జి స్క్వేర్ ఉయిర్ మయ్యం' ప్రారంభించేందుకు జి స్క్వేర్ రియల్టర్స్ రోటరీ క్లబ్ ఆఫ్ చెన్నై కర్నాటిక్‌తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు బాల రామజయం మాట్లాడుతూ.. ఉయిర్‌మయ్యం కేంద్రం ఆరోగ్య సంరక్షణతో పాటు కరుణ, దయ కలిగి వుంటుందన్నారు. డయాలసిస్ అనేది జీవితాన్ని నిలబెట్టే చికిత్స అని, దీనిని పేదలు భరించడం అసాధ్యమన్నారు. అందుకే అలాంటి వారి కోసం ప్రత్యేకంగా ఈ కేంద్రాన్ని స్థాపిస్తున్నామన్నారు. ఇది సమాజ శ్రేయస్సు కోసం తమ కనీస బాధ్యతగా భావించి నిర్వహిస్తున్నామన్నారు. చెన్నై కర్నాటిక్ రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఆర్‌టీఎన్ అరుణ్‌కుమార్ మహదేవన్ మాట్లాడుతూ.. ఈ సహకారం సమాజ శ్రేయస్సు పట్ల తమ లోతైన నిబద్ధతన ప్రతిబింబిస్తుందని తెలిపారు.

ఘనంగా నరసారెడ్డి జన్మదిన వేడుకలు


విద్యార్థుల మధ్య కేక్ కట్ చేస్తున్న నరసారెడ్డి

ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కెన్సెస్ సంస్థల అధినేత, ఆస్కా మాజీ అధ్యక్షులు కె.నరసారెడ్డి శనివారం తన జన్మదిన వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య ఘనంగా జరుపుకున్నారు. టి.నగర్ కేసరి పాఠశాల ప్రాంగణంలో కేక్ కట్ చేసి ప్రారంభించిన వేడుకలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నరసారెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. పాఠశాల పురోభివృద్ధి, విద్యార్థులను ప్రోత్సహించడంలో నరసారెడ్డి పాత్ర అద్వితీయమని ఉపాధ్యాయులు ప్రశంసించారు. విద్యార్థినీవిద్యార్థులు తెలుగు, తమిళం, ఆంగ్ల భాషల్లో నరసారెడ్డి సేవలు, ఔన్నత్యాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా నరసారెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో నరసారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, కెన్సెస్ సీఈవో ఎం.కృష్ణ తదితరులు సహపంక్తి భోజనం చేశారు.

నేత్ర వైద్యుల మధ్య సమన్వయం అవసరం

- మంత్రి పళనివేల్ త్యాగరాజన్



లక్నోకు చెందిన ప్రముఖ నేత్రవైద్యురాలు డాక్టర్ జయా కౌశిక్‌ను స్వర్ణపతకంతో సత్కరిస్తున్న మంత్రి పళనివేల్ త్యాగరాజన్, ప్రొఫెసర్ అమర్ అగర్వాల్ తదితరులు

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేత్ర వైద్యచికిత్సా విధానాల్లో నేడు విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నాయని, దేశవిదేశాలకు చెందిన వైద్యనిపుణుల మధ్య సమన్వయం అవసరమని, అప్పుడే వారి ఆవిష్కరణల సమాచారాన్ని అందరూ తెలుసుకోగలుగుతారని రాష్ట్ర సమాచార సాంకేతిక, డిజిటల్ సర్వీసుల శాఖల మంత్రి పళనివేల్ త్యాగరాజన్ పేర్కొన్నారు. గిండీలోని స్టార్‌హోటల్‌లో శనివారం ఉదయం ఐఐఆర్ఎస్ఐ- 2025 పేరుతో ఏర్పాటైన అంతర్జాతీయ సదస్సును మారిషస్ ఆరోగ్యశాఖ మంత్రి అనిల్‌కుమార్ బచూ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పళనివేల్ త్యాగరాజన్ మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడల్లా విద్య, వైద్యానికి అగ్రతాంబూలం ఇస్తుందని, మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి హయంలో 'కన్నొలి దిట్టమ్' పేరుతో నిరుపేదలకు ఉచిత కాంటాక్ట్ ఆపరేషన్ల పథకం అమలు చేశారని గుర్తు చేశారు. ఐఐఆర్ఎస్ఐ-2025 అధ్యక్షుడు డాక్టర్ సతాన్షు మాథుర్, సెక్రటరీ జనరల్ ప్రొఫెసర్ అమర్ అగర్వాల్, వేల్స్ యూనివర్శిటీ ప్రో-ఛాన్సలర్ డాక్టర్ ఆరతి గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో దేశవిదేశాలకు చెందిన సుమారు వెయ్యి మందికి పైగా నేత్రవైద్యులు పాల్గొన్నారు.

రేపు వల్లకోట మురుగన్ ఆలయ కుంభాభిషేకం

- యాగశాల పూజలు ప్రారంభం



ప్యారీస్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా ఒరగడం సమీపంలోని వల్లకోటలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయ మహాకుంభాభిషేకం సోమవారం జరగనుంది. ఈ ఆలయానికి 17యేళ్ల అనంతరం కుంభాభిషేకం నిర్వహించాలని నిర్ణయించి గత ఏడాదిలో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభించారు. శిథిలావస్థలో ఉన్న మూలవర్, విఘ్నేశ్వరుడు, షణ్ముఖుడు, త్రిపుర సుందరి ఉత్సవమూర్తులను పునరుద్ధరించారు. అలాగే ఇడుంబన్, కడంబన్, భైరవ సన్నిధులు, ఉత్తర రాజగోపురం, ఆలయ ప్రాంగణంలోని గోపుర విమానాలకు రూ.1.50 కోట్లతో మరమ్మతులు పూర్తిచేశారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి మహాకుంభాభిషేకాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 60 యాగగుండాల్లో శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభించిన యాగపూజల్లో 108 మంది శివాచార్యులు, 9 మంది భట్టాచార్యులు పాల్గొన్నారు. ముందుగా గణపతి పూజతో పూర్వాంగ కార్యక్రమాలు ప్రారంభించారు. శనివారం 2,3 జాముల యాగ పూజలు, ఆదివారం ఉదయం 4,5 జాముల పూజలు నిర్వహిస్తారు. అనంతరం జరిగే కుంభాభిషేకంలో పాల్గొనే భక్తులకు 40 మొబైల్ టాయిలెట్లు, తాగునీటి సదుపాయం కల్పించనున్నారు. 17యేళ్ల అనంతరం ఈ ఆలయానికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్న నేపథ్యంలో వల్లకోట గ్రామస్తుల్లో భక్తిభావం కనిపించింది. కాంచీపురం హిందూ దేవాదాయశాఖ సంయుక్త కమిషనర్ కుమారదురై పర్యవేక్షణలో ఏర్పాట్లు జరుగుతున్నాయి.


చెన్నైలో శనివారం ఉదయం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన ప్రముఖ తమిళపండితుడు కవికో వీఎం సేతురామన్ భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్



అవార్డుల ప్రదానోత్సవ దృశ్యం

వేడుకగా పీజీసీ అవార్డుల ప్రదానోత్సవం

చెన్నై, జూలై 5 (ఆంధ్రజ్యోతి): 'పొన్నేరి జింఖానా క్లబ్ (పీసీజీ) అవార్డుల ప్రదానోత్సవం శుక్రవారం రాత్రి వేడుకగా జరిగింది. వివిధ రంగాలకు చెందిన 25 మందిని ఎంపిక చేసి ఈ అవార్డులను అందించారు. ఆర్కాడు యువరాజు మహమ్మద్ ఆసిఫ్ అలీ ముఖ్య అతిథిగా, పొన్నేరి అసిస్టెంట్ కమిషనర్ శంకర్, ఎమ్మెల్యే దురై చంద్రశేఖర్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ శంకర్ మాట్లాడుతూ.. మంచి వ్యక్తులను గౌరవించడమంటే వారు చేసే పనుల గురించి మాత్రమే కాదని, వారికి మరింత బాధ్యత గుర్తు చేస్తున్నట్లు కూడానన్నారు. ఈ వేడుకకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు కూడా హాజరయ్యారు.

విజయ్‌ను సీఎం లెఫ్ట్ హ్యాండ్‌తో డీల్ చేస్తారు

● దేవాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు

అడయార్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): క్రియాశీలక రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సినీ హీరో, టీవీకే అధ్యక్షుడు విజయ్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ తన ఎడమ చేత్తో హ్యాండిల్ చేస్తారని దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు జోస్యం చెప్పారు. చెన్నై మహానగరంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, విజయ్ రాజకీయ ప్రవేశంపై తాము ఆందోళన చెందడం లేదన్నారు. తమిళుల ఆరాధ్యదైవమైన మురుగన్ కోసం డీఎంకే ప్రభుత్వం చేసినట్టుగా ఇప్పటివరకు ఏ ప్రభుత్వం చేయలేదన్నారు. ఈ నెల 14న తిరుప్పరకుండ్రం ఆలయ కుంభాభిషేకం జరుగుతుందన్నారు. ఈ వేడుకలకు వచ్చే భక్తుల కోసం అన్ని రకాల ఏర్పాట్లు, బస్సుల పార్కింగ్ కోసం మూడు తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశామన్నారు. కుంభాభిషేకం తర్వాత స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తామన్నారు.

16న శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం

తిరుమల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో 16వ తేదీన ఆణివార ఆస్థానం జరగనున్న నేపథ్యంలో ముందురోజైన 15వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం(ఆలయ శుద్ధి) కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ రెండు ఉత్సవాల నేపథ్యంలో స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. 14, 15 తేదీల్లో సిఫార్సు లేఖలను తీసుకోబోమని స్పష్టం చేసింది. ఆణివారం ఆస్థానం రోజున ఆలయంలోని బంగారు వాకిలిలో సర్వభూపాల వాహనంలో ఉత్సవమూర్తులను కొలువుదీరుస్తారు. అలాగే మరోపీఠంపై స్వామి సర్వసైనాధ్యక్షుడైన విష్వక్సేనులస్వామి దక్షిణాభిముఖంగా వేంచేపు చేస్తారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదిస్తారు. తర్వాత శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో 'పరివట్టం' (చిన్నపట్టుగుడ్డ) కట్టుకుని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామిని ఆశీర్వదిస్తారు. తర్వాత అర్చకులు పెద్ద, చిన్నజీయర్ స్వాములకు, టీటీడీ తరపున ఈవోకు 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడి చేతికి ఇచ్చి, 'రూపాయి' హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేస్తారు. అనంతరం ఈ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల వద్ద ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగుస్తుంది.


శ్రీవారి దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.


గురువారం హుండీ ఆదాయం: రూ.3.53 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,011

తలనీలాలు సమర్పించినవారు: 28,496



ప్రోగ్రెస్ రిపోర్ట్



తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఈ ఏడాది కాలంలో ఏం చేశారు? ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేరాయి? పెండింగ్‌లో ఉండిపోయిన సమస్యలపై ఆయన ఏమంటున్నారు? శాసనసభ్యుడిగా ఆరణి శ్రీనివాసులును గెలిపించిన తిరుపతి నగర ప్రజలు ఆయన నుంచి ఏం కోరుతున్నారు? రెండో ఏడాదిలో తిరుపతి నగరం అభివృద్ధికి ఏం చేయదలచుకున్నారు?.. అనే ప్రశ్నలకు సమాధాన సమాహారమే ఇది..

- కథనం, ఇంటర్వ్యూ : తిరుపతి, ఆంధ్రజ్యోతి

● తిరుమల ప్రక్షాళన ప్రారంభం ● శెట్టిపల్లి సమస్య సెటిల్ ● గంగమ్మగుడి పూర్తి చేశాం

ప్రశాంత తిరుపతి సాధించాం!

హామీ స్థానికులకు శ్రీవారి దర్శనం పునరుద్ధరిస్తాం.

అమలు: ప్రతినెలా రెండో మంగళవారం స్థానికులకు దర్శనం ఏర్పాటు జరిగింది.

హామీ నిజమైన టీడీఆర్ బాండ్ల లబ్ధిదారులకు న్యాయం చేస్తాం.

అమలు: బాండ్ల జారీలో అవకతవకలపై విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ప్రస్తుతం 207 మందికి బాండ్లు అందజేశారు. దశలవారీగా విచారించి మిగిలిన వారికి కూడా బాండ్లు ఇస్తామని చెబుతున్నారు.

హామీ శెట్టిపల్లి సమస్యను పరిష్కరిస్తాం.

అమలు: కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్యలు చొరవ తీసుకుని చర్చలు జరిపారు. శెట్టిపల్లి సమగ్రాభివృద్ధికి అన్ని పక్షాల అంగీకారం లభించింది. త్వరలోనే శెట్టిపల్లి భూ బాధితులకు ప్రోసీడింగ్స్ అందుతాయని చెబుతున్నారు.

హామీ అర్థాంతరంగా వదిలేసిన తాతయ్యగుంట గంగమ్మ ఆలయ నిర్మాణాన్ని పూర్తిచేస్తాం.

అమలు: టీటీడీ సహకారంతో రూ.10కోట్లతో గంగ జాతరలోపు ఆలయాన్ని పూర్తిచేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొచ్చారు.

హామీ ప్రశాంత తిరుపతిగా మారుస్తాం

అమలు: కూటమి అధికారంలోకి వచ్చాక తిరుపతి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.అరాచకాలు, దౌర్జన్యాలు తగ్గాయి.కబ్జాల భయం తగ్గింది.

వైసీసీ పాపం తిరుపతి స్మార్ట్‌కు శాపం

కేంద్ర ప్రభుత్వం విడుదలచేసే స్మార్ట్ సిటీ నిధులకు మ్యాచింగ్ గ్రాంట్‌గా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. వైసీసీ హయాంలోని ఐదేళ్లలో పైసా కూడా ఇవ్వలేదు. స్మార్ట్‌సిటీ గడవుపూర్తయింది. ఇక కేంద్ర ప్రభుత్వ నిధులు నిలిచిపోయాయి. దీంతో ప్రధానమైన మున్సిపల్ పరిపాలన భవనం, మల్టీలెవల్ కార్ పార్కింగ్, క్రికెట్ స్టేడియం వంటి పనులు ఆగిపోయాయి. వీటిని పూర్తి చేయాలి. నిరుపయోగంగా ఉన్న స్థలాన్ని విక్రయించి వచ్చే నిధులతో మున్సిపల్ కార్యాలయాన్ని పూర్తిచేయాలని భావిస్తే.. దానిమీద వైసీపీ దుష్ప్రచారం చేసింది. త్వరలోనే తగు నిర్ణయంతీసుకుని పరిపాలన భవనాన్ని పూర్తిచేస్తాం.

'ఆంధ్రజ్యోతి'తో కలిసి జీవకోన ముఖచిత్రం మార్చాం



'అక్షరమే అండగా..పరిష్కారమే అజెండగా' నినాదంతో 'ఆంధ్రజ్యోతి'నిర్వహించిన సదస్సు ద్వారా తిరుపతి జీవకోన ముఖచిత్రం మార్చాం. నా సొంత నిధులతో జీవకోన ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రెండు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశాను. మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా దాదాపు రూ.1.20లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, ప్యాచ్ వర్కులు పూర్తి చేశాం. ఇచ్చిన హామీ మేరకు పోలీస్ అవుట్ పోస్టును కూడా ప్రారంభించాం. ఇవికాకుండా మరో రూ.52.30లక్షల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) రూ.35లక్షలతో జీవకోన వద్ద గల లెప్రసీ కాలనీలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసింది.

హామీ అంతర్గత రోడ్లు నిర్మిస్తాం. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులు పూర్తి చేస్తాం.

అమలు: గత వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్ నిధులను ఖాళీ చేసింది. పైగా కాంట్రాక్టర్లకు రూ.80కోట్లకు పైగా బకాయి పెట్టారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు దశలవారీగా బిల్లులు చెల్లిస్తూనే ఈ ఏడాదిలో దాదాపు రూ.30కోట్లతో 267 అభివృద్ధి పనులను చేపట్టారు. కొత్తరోడ్లు, ప్యాచ్ వర్కులు, కాలువల్లో పూడికతీత, తాగునీటి పైపులైన్ల మరమ్మతులు వంటి పనులు జరిగాయి. మరో రూ.17కోట్లతో 45 పనులు టెండరు దశలో ఉన్నాయి.

హామీ అధికారంలోకి వచ్చాక తిరుమలను ప్రక్షాళన చేస్తాం.

అమలు: తిరుమల నుంచి సీఎం చంద్రబాబు ఆదేశంతో ఇప్పటికే ప్రక్షాళన ప్రారంభమైంది. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణలు జరుగుతున్నాయి. వీఐపీ బ్రేక్ దర్శనాలు క్రమబద్ధీకరించాం. అన్నప్రసాదాలు నాణ్యత పెంచాం. లడ్డూ రుచి పెరిగింది.



ప్రజల ప్రశ్నలు - ఎమ్మెల్యే జవాబులు



? తిరుపతిలో డ్రైనేజీ వ్యవస్థ పాతికేళ్లకన్నా కిందటిది. చిన్నవానకే కాలువలు పొంగిపొర్లుతున్నాయి. గతంలోనూ దీన్ని ఎవరూ పట్టించుకోలేదు. మీరైనా తిరుపతి డ్రైనేజీ వ్యవస్థ ప్రక్షాళనకు పూనుకోండి ఎమ్మెల్యేగారూ.

- ఎం.బాబు, జీవకోన

! 1999లో టీడీపీ హయాంలోనే అప్పటి సీఎం నారా చంద్రబాబు నాయుడు తిరుపతికి యూడీఎస్‌ను తీసుకొచ్చారు. నగరం విస్తరించింది. యూడీఎస్ పైపుల సామర్థ్యం కన్నా ఎక్కువగా మురుగునీరు ప్రవహించడం వలన మ్యాన్‌హోల్స్ తెరుచుకుంటున్నాయి. యూడీఎస్ రీవ్యాంప్‌కు రూ.80కోట్లు అవసరం. నగర పాలక సంస్థ నిధులు సరిపోవు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర నిధులు తీసుకొచ్చి యూడీఎస్‌ను రీవ్యాంప్ చేస్తాం. ఈ ఏడాదిలోనే నిధులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. తిరుపతి యూడీఎస్‌ను కేంద్ర ప్రభుత్వ ప్రజారోగ్య, పర్యావరణ ఇంజనీరింగ్ సంస్థ (చెప్కో) అడ్వైజర్ కమిటీ ప్రతినిధులు ఇటీవల పరిశీలించారు. కమిషనర్ మౌర్య ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే

ఈ ఏడాది ఇవి చేస్తా!

ఎమ్మార్‌పల్లెలో మరో 2 వాటర్ ప్లాంట్లు: జేఎంసీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లను జీవకోనలో ఏర్పాటు చేసిన విధంగా ఎమ్మార్ పల్లెలో కూడా మరో 2 ఏర్పాటు చేయబోతున్నాం.

తిరుపతిలో ప్రభుత్వ కాలేజీలు: తిరుపతిలో ఇప్పటివరకు ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కాలేజ్ లేదు. టీటీడీ ఆధ్వర్యంలో మాత్రమే కళాశాలలు ఉన్నాయి. అందుకే ప్రభుత్వ కాలేజీలు అవసరమని కోరాం.



బలిజ భవన్ పూర్తి చేస్తాం: బలిజ భవన్‌కోసం గతంలోనే చంద్రబాబు స్థలం, తుడా నుంచి నిధులు కేటాయించారు. పునాదులు కూడా వేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు నిలిపివేశారు. బలిజ భవన్ కోసం ప్రభుత్వంతో మాట్లాడి దాతల ద్వారానైనా పూర్తిచేయాలన్న ఆలోచనలో ఉన్నాం.

ఆర్టీసీ మోడల్ బస్టాండు: త్వరలో పునాది వేయనున్నాం. పీపీపీ పద్ధతిలో రూ.550 కోట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మాణం జరగనుంది.





? పలుసార్లు రిజిస్ట్రేషన్లు జరిగి తర్వాత హఠాత్తుగా 22ఏ (నిషేధిత జాబితా)లో పెట్టడం వలన క్రయ, విక్రయాలకు చేసుకోలేకుండా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై మీరు తగిన నిర్ణయం తీసుకునేలా ప్రయత్నించండి ఎమ్మెల్యేగారూ.

- డాక్టర్ ఎన్.ధర్మయ్య, రిటైర్డ్ అధికారి

! రాజకీయ కక్షతోనే వైసీపీ హయాంలో కొన్ని ప్రాంతాల్లో 22ఏ (నిషేధిత జాబితా)లో పెట్టి భూ హక్కును కోల్పోయేలా చేశారు. దీని వలన అక్కరకు అమ్ముకోవాలంటే అడ్డంకిగా మారుతోంది. 22ఏ జాబితాలో ఉన్న వాటిని దశలవారీగా తొలగిస్తున్నాం. ఇటీవలే గంగమ్మ గుడి ప్రాంతాన్ని తొలగించి వారికి ఊరటకలిగించాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే



? తిరుపతికి తూర్పువైపున ఒక్క అన్న క్యాంటీన్ కూడా లేదు. కార్మికులు ఎక్కువగా ఉండేది ఇక్కడే. ఈ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లు పెడతామని మీరు ఇచ్చిన హామీని గుర్తు చేస్తున్నాను.

- సుబ్రమణ్యం నాయుడు, సత్యనారాయణపురం

! తిరుపతిలో 4 అన్న క్యాంటీన్లున్నాయి. మరో 3 అవసరమని సీఎంను కోరాను. సానుకూలంగా స్పందించారు. కార్మిక, శ్రామిక వర్గం ఎక్కువగా ఉండే ఆటోనగర్, జీవకోన, లీలామహల్ ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేయనున్నాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే



? ఎమ్మెల్యేగారూ.. తిరుపతిలో 'ఫుడ్ కోర్టు' ఏర్పాటు చేస్తామని చెప్పారు. మళ్లీ ఆ ప్రస్తావన రావడం లేదు?

- పార్థసారథి, కొర్లగుంట

! ఈట్ స్ట్రీట్స్ ఏర్పాటుచేసేందుకు కమిషనర్ మౌర్యతో కలసి పలు వీధులు పరిశీలించాం. శ్రీనివాసం సమీపంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే

నేడు ప్రపంచ జూనోసిస్ డే



ప్రేమ సరే.. జాగ్రత్త సుమా..!

జంతువుల నుంచి వ్యాధులు సోకే ప్రమాదం ● టీకాలు వేయించడంలో అలసత్వం వద్దు

జంతువుల మీద చాలామందికి మక్కువ ఉంటుంది. ప్రేమతో దగ్గరకు చేరదీసి పెంచుతుంటారు. కాలక్షేపం..కాపలా..ఆత్మీయత.. ఒంటరితనం..హోదా...కారణమేదైనా జీవన గమనంలో ఈ మిత్రజీవుల ప్రాధాన్యం పెరిగింది. ఆధునిక సమాజంలో ఇంట్లో ఓ పెంపుడు జంతువు సాధారణమైంది. ఈ జాబితాలో శునకాలదే సింహభాగం. అవగాహనతో వీటిని సాకకపోతే కొన్ని వ్యాధులు సంక్రమించే అవకాశముందని వెటర్నరీ వైద్య నిపుణులు చెబుతున్నారు. జంతువులు, పక్షుల నుంచి మనుషులకు..మన నుంచి పక్షులు, జంతువులకు 150 రకాల హానికర వ్యాధులు(జూనోసిస్) సంక్రమించే ప్రమాదముంది.

- తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి

వ్యాధులెలా సంక్రమిస్తాయంటే..

జంతువులు కరిచినా, సరిగా ఉడకని మాంసం, పాలు, గుడ్లు, ఇతర ఆహార పదార్థాలు తిన్నా జూనోసిస్ వ్యాధులు సోకుతాయి. సాధారణ జ్వర లక్షణాలతో మొదలై.. ఒక్కోసారి ప్రాణాంతకంగా మారే ప్రమాదమూ ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రేబిస్, లెప్టోస్పైరా, ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, నిఫా, టీబీ, బర్డ్‌ఫ్లూ తదితరాలు. పశువులు, పందులు, ఎలుకలు, వీధి కుక్కల నుంచి ఈ వ్యాధులు వ్యాపిస్తాయి. బ్యాక్టీరియా, పరాన్నజీవులు, వైరస్‌ల ద్వారా సంక్రమిస్తాయి.

రేబిస్‌తో ప్రాణాలకు ముప్పు

ఎక్కువ మంది ఇళ్లలో కుక్కలను పెంచుతుంటారు. రేబిస్ సోకిన కుక్క లాలాజలం నుంచి మనుషులకు ఆ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన మొదటిదశలో జ్వరం, తలనొప్పి, దురద, అనారోగ్యం, ఉద్రేకం, నోటి నుంచి చొంగకారడం, కళ్లల్లో నీరుకారడం, మింగలేకపోవడం, మూర్ఛ తదితర లక్షణాలు కనిపిస్తాయి. రెండో దశలో అపస్మారక స్థితికి చేరుకుని ప్రాణాలు పోయే పరిస్థితి వస్తుంది. మనుషులు, జంతువులను పిచ్చికుక్క కరిచిన వెంటనే గాయాన్ని కార్బాలిక్ సోపు లేదా సబ్బుతో కనీసం పదిసార్లు శుభ్రంగా కడగాలి. వెంటనే వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి. కుక్క కరచిన రోజు నుంచి బాధితుడికి 28రోజుల్లో 5సార్లు టీకాలు వేయించాలి. తర్వాత ఏడాదికోసారి వేయించాలి. 3నెలలు పైబడిన కుక్కలకు టీకాలు తప్పనిసరి. తర్వాత ఏటా క్రమం తప్పకుండా వేయించాలి.

జ్వర లక్షణాలుంటే సంప్రదించండి



నగరాల్లో ఎక్కువమంది కుక్కలను పెంచుకుంటున్నారు. ఆరోగ్యవంతమైన వాటినే కొనుగోలు చేయాలి. మనం తినే ప్రతీది దానికి పెట్టకూడదు. వైద్యులను సంప్రదించి ఆహారం పెట్టాలి. వీటికి కూడా కిడ్నీ, మధుమేహం తదితర సమస్యలు ఉంటాయి. పరిశుభ్రంగా ఉంచాలి. రెండు రోజులపాటు తీవ్రమైన జ్వర లక్షణాలు కనిపిస్తే పరీక్షలు చేయాలి. వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్‌లో కుక్కలు, ఇతర జంతువులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైతే వైద్యచికిత్స చేస్తున్నాం. ఆస్పత్రిలో స్కానింగ్ లాంటివి కూడా ఉన్నాయి.

- వి.వైకుంఠరావు, వీసీసీహెడ్, ఎస్వీ వెటర్నరీ కళాశాల

నేడు ఉచిత వ్యాక్సిన్ క్యాంపు



తిరుపతి తాతయ్యగుంట వెటర్నరీ కళాశాలలోని నగర పశువైద్య ఆసుపత్రిలో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం 9 గంటలకు పెంపుడు జంతువులకు(కుక్కలు, పిల్లులు) ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నారు. దీన్ని జంతు ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని రాలేని వారు సోమ, మంగళవారాల్లో కూడా వచ్చి వ్యాక్సినేషన్ వేయించుకోవచ్చునని సూచించారు.

- పి.జగపతిరామయ్య, అసోసియేట్ డీన్

50 ఎర్రచందనం దుంగల పట్టివేత

● ఓ స్కూటీని ఢీకొనడంతో పట్టుబడ్డ వాహనం



పట్టుబడ్డ ఎర్రచందనం దుంగలు

నాయుడుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఓ కారులో తరలిస్తున్న 50 ఎర్రచందనం దుంగలను అగ్నిమాపక సిబ్బంది పట్టుకున్నారు. ఈ సంఘటన నాయుడుపేటలో చోటుచేసుకుంది. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అగ్నిమాపకశాఖ కార్యాలయం సమీపంలో ఓ ఇంటివద్ద వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం 5 గంటల సమయంలో స్కూటీని అగ్నిమాపకశాఖ కార్యాలయం వద్ద పెడుతుండగా అదే సమయంలో వెంకటగిరి నుంచి చెన్నైకు ఎర్రచందనంతో వెళ్తున్న కారు వేగంగా వచ్చి స్కూటీని ఢీకొంది. అదే సమయంలో శ్రీనివాసులు గాయపడగా స్కూటీ బాగా దెబ్బతింది. పక్కనే ఉన్న అగ్నిమాపక సిబ్బంది కేకలు వేస్తూ శీనయ్య వద్దకు వచ్చి ఆయనను లేపి పక్కన కూర్చోబెట్టే సమయంలో ఎర్రచందనం తరలిస్తున్న వాహనంలో ఉన్న వారు అక్కడ నుంచి వాహనాన్ని వదిలి ఉడాయించారు. అగ్నిమాపక సిబ్బంది ఎర్రచందనం వాహనాన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. గాయపడ్డ శీనయ్యను ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పట్టుబడ్డ ఎర్రచందనం వాహనానికి ఉన్న నెంబరు తప్పు ఉండటంతో వాహనం ఇంజన్‌కు ఉన్న నెంబరును రోడ్డు రవాణాశాఖ అధికారులకు పంపి కారు యజమాని తెలుసుకునేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడ్డ ఎర్రచందనం, వాహనంతో కలిపి రూ.10 లక్షలు విలువ ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎర్రచందనాన్ని వెంకటగిరి అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

128 గ్రాముల బంగారాన్ని గదిలో మర్చిపోయిన భక్తులు

● తిరిగి భక్తులకు అప్పగించిన టీటీడీ అధికారులు

తిరుమల, జూలై 5(ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనం కోసం వచ్చి గదిలో మర్చిపోయిన 128 గ్రాముల బంగారు ఆభరణాలను టీటీడీ రిసెప్షన్ అధికారులు తిరిగి భక్తులకు అప్పగించారు.తమిళనాడు రాష్ట్రం మధురై పట్టణానికి చెందిన శివానందన్ కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తిరుమలకు వచ్చారు. కాప్రి వకుళామాత గెస్ట్‌లో 5వ నెంబరు గదిని అద్దెకు తీసుకున్నారు. శ్రీవారి దర్శనం ముగించుకుని శనివారం తిరుగుప్రయాణ హడావుడిలో 128 గ్రాముల బంగారు ఆభరణాలను గదిలోనే మర్చిపోయారు. గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన తుకారాం సోమ మందాకర్, వెంకటముని వాటిని గుర్తించి టీటీడీ రిసెప్షన్ అధికారులకు అందజేశారు. ఆభరణాలు మర్చిపోయామని తిరిగి వచ్చిన భక్తుల నుంచి వివరాలు సేకరించిన అనంతరం పద్మావతి విచారణ కార్యాలయం సూపరింటెండెంట్లు కుమారస్వామి, భాస్కరనాయుడు ఆ ఆభరణాలను తిరిగి శివానందన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.12 లక్షల విలువైన బంగారు ఆభరణాలు తిరిగి అప్పగించిన అధికారులకు, సిబ్బందికి శివానందన్ ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిజాయితీగా బంగారు ఆభరణాలను అప్పగించిన గెస్ట్‌హౌస్ సిబ్బందిని అధికారులు అభినందించారు.



ఒడిశాలో తిరువళ్ళూరు యువకుడి హత్య: మృతదేహం కోసం రాస్తా రోకో

అడయార్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్ళూరు జిల్లా పులంబాక్కం ప్రాంతానికి చెందిన అజయ్ అనే యువకుడు ఒడిశాలో గంజాయి ముఠా చేతిలో హత్యకు గురయ్యాడు. దీంతో మృతదేహాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులు శనివారం రోడ్డురోకోకు దిగారు. పులంబాక్కంకు చెందిన హరి కుమారుడు అజయ్... టూర్ కు వెళుతున్నానని ఇంటో చెప్పి.. రెడ్‌హిల్స్ ప్రాంతానికి చెందిన అభినేష్ అనే పాత నేరస్థుడితో కలిసి గంజాయి కోసం ఒడిశాకు వెళ్ళాడు. అక్కడ 3 కేజీల గంజాయి తీసుకుని రైలు పట్టాలపై నడిచి వస్తుండగా, అక్కడి గంజాయి ముఠా దాడిచేసింది. ఈ దాడిలో అభినేష్ తప్పించుకోగా, అజయ్ ఆ ముఠా చేతిలో ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయాన్ని అభినేష్ మృతుడితల్లిదండ్రులకు సమాచా రం ఇచ్చాడు. దీంతో తమ కుమారుడు మృతదేహాన్ని రాష్ట్రానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. జాప్యం జరగడంతో మృతుడి బంధువులు శనివారం రోడ్డు రోకోకు దిగారు. పోలీసులు సర్ది చెప్పడంతో వారు ఆందోళనను విరమించారు.

ఆస్పత్రిలో వసతులు కల్పించండి

● అధికారులకు రోగుల విజ్ఞప్తి



ఆస్పత్రిలో టేబుల్‌ఫ్యాన్లు వేసుకున్న రోగులు

తిరుత్తణి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వాసుపత్రిలో కనీస వసతులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా ఐసీయూలో చికిత్స పొందుతున్న పేషెంట్లకు ఏసీ, ఫ్యాన్లు వంటి కనీస సదుపాయాలు లేవని రోగుల కుటుంబీకులు వాపోతున్నారు. అత్యవసర సమయంలో డాక్టర్లు కూడా అందుబాటులో ఉండరని, మందులను పరిరక్షించుకోడానికి రిఫ్రిజిరేటర్లు కూడా ఏర్పాటు చేయలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో సుమారు 300 మందికి పైగా ఇన్‌పేషెంట్లు ఉన్న ఆ ఆస్పత్రిలో నలుగురు నర్సులు మాత్రమే పని చేస్తున్నారని, రాత్రి సమయాల్లో దోమల బెడద ఎక్కువగా ఉందని, అత్యవసర విభాగాల్లో పనిచేయాల్సిన ఏసీలు మరమ్మతులకు గురవగా, వాటిలో కేవలం ఒకటి మాత్రమే ఉపయోగంలో ఉందని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకుని ఆస్పత్రిలో మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.